తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యపేట యాద్రాద్రి భువనగిరి
మంగళవారం
06 అక్టోబర్ 2026
పేజీలు : 8
Follow :

## ఇళ్లపై నుంచి 11 కేవీ హైటెన్షన్ లైన్..

# ప్రమాదం అంచున కుటుంబాలు

○రామచంద్రపురం ఎస్సీ కాలనీలో నివాసాల మీదుగానే విద్యుత్ లైన్ ○ ఏళ్లుగా సమస్య.. పట్టించుకోని అధికారులు ○ వెంటనే లైన్‌ను సురక్షిత ప్రాంతానికి తరలించాలని కాలనీవాసుల డిమాండ్

**కనగల్లు, అక్టోబర్ 5 (జనంసాక్షి):** రామచంద్రపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో నివాస గృహాల మీదుగా 11 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ వెళ్తుండటంతో కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. ఏళ్లుగా సమస్య ఉన్నప్పటికీ పలుమార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పరిష్కారం లభించలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల మధ్యలోనే హైటెన్షన్ లైన్ ఉండటంతో వర్షాలు, గాలులు వీచే సమయంలో వైర్లు ఊగుతూ ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయని చెబుతున్నారు. ఇళ్లపైకి ఎక్కినా, పొరపాటున విద్యుత్ తీగలకు సమీపంగా వెళ్లినా ప్రాణాపాయం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మనిషి నిలబడి చేయి ఎత్తితే అందేంత తక్కువ ఎత్తులోనే విద్యుత్ లైన్ ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు.



**ఇల్లు కట్టుకోలేని పరిస్థితి**



హైటెన్షన్ లైన్ ఇంటి స్థలం మధ్య నుంచి వెళ్లడంతో కొత్త ఇల్లు నిర్మించుకోలేకపోతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. ఎన్నిసార్లు అధికారులను వేడుకున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని జీవించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఇరిగి సాలమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. పక్కా ఇల్లు నిర్మించుకునే అవకాశం లేక గుడిసెల్లోనే నివసించాల్సి వస్తోందన్నారు.

**వెంటనే లైన్‌ను తరలించాలి**

11 కేవీ హైటెన్షన్ లైన్‌ను ఇళ్లపై నుంచి, నివాస ప్రాంతం మధ్య నుంచి తొలగించి సురక్షిత ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.



ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి అవసరమైన చోట ఏబీ కేబుల్ ఏర్పాటు చేయడంతో పాటు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. ప్రజలకు, మూగజీవాలకు ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

## నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి

### ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలి

జూదంపై కఠిన చర్యలు..

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

ఎస్పీ రాజేష్ చంద్ర 2లో

## పత్తి ఎంఎస్ పి కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ దివాకర టిఎస్ 3లో

## విద్యార్థుల అభ్యసనకు అనుకూల వాతావరణం కల్పించాలి

### కలెక్టర్ అంకిత్

ఎస్ఏ-1 పరీక్షల నిర్వహణను పరిశీలించిన కలెక్టర్

ప్రీ-ప్రైమరీ చిన్నారులకు అందుతున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజన అమలు పరిశీలన 3లో

## ప్రజావాణి ఫిర్యాదుల పెండెన్సీ తగ్గించాలి

కలెక్టర్ చంద్ర శేఖర్ 3లో

## ప్రజావాణి వినతులకు సత్వర పరిష్కారం చూపాలి

### కలెక్టర్ అంకిత్

○ ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

○ ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావివ్వొద్దు



**భద్రాద్రి కొత్తగూడెం అక్టోబర్05 (జనంసాక్షి):** ప్రజల నుంచి స్వీకరించే ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, డిఆర్ఓ పద్మావతి తో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. భూ సంబంధిత సమస్యలు, **వార్తా లోపలి పేజీలో**

## మధిర మిర్చి మార్కెట్ యార్డులో నిలిచిన కొనుగోళ్లు

○దళారులు- అధికారులు ల మధ్య వివాదంలో నలిగిపోతున్న అన్నదాత

○లైసెన్సుల నిబంధనలు, పన్ను వివాదాలతో బయ్యర్ల సమ్మె

**మధిర, అక్టోబర్ 5 (జనంసాక్షి):** మధిర వ్యవసాయ మార్కెట్ యార్డులో మిర్చి విక్రయాల చుట్టూ వివాదం నెలకొంది. మార్కెట్ యార్డు పాలకవర్గం, దళారులు, (బయ్యర్లు) మధ్య తలెత్తిన విభేదాల కారణంగా మిర్చి కొనుగోళ్లు స్తంభించిపోయే పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి వచ్చిన రైతులు దిక్కుతోచని స్థితిలో పడి నష్టపోయే ప్రమాదం కనిపిస్తోంది. మార్కెట్ యార్డులో పలువురు వ్యాపారులు, దళారులు సరైన లైసెన్సులు లేకుండానే లావాదేవీలు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మార్కెట్ కమిటీ వ్యవస్థను క్రమబద్ధీకరించేందుకు (రెగ్యులరైజేషన్) తప్పనిసరిగా లైసెన్సులు తీసుకోవాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో కొందరు దళారులు దీనిపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పూర్తి పన్నుల భారం పడుతుండటంతో బయటి నుంచి వచ్చే బయ్యర్లు మధిరలో కొనుగోలు చేయడానికి విముఖత వ్యక్తం చేస్తూ "మేము కొనలేం" అంటూ వెనకడుగు వేస్తున్నారు. అధికారిక నిబంధనలకు లోబడకుండా **వార్తా లోపలి పేజీలో**







# ఆర్టీసీ కార్మికుల హక్కుల సాధనే ధ్యేయం.. అక్టోబర్ 9న కూటమి గెలుపు తథ్యం!

## కార్మికుల సంక్షేమం కోసం బస్సు, కాగడ గుర్తులకు ఓటేసి అత్యధిక మెజారిటీని అందించండి



**మధిర, అక్టోబర్ 5 (జనంసాక్షి):** ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, పరిరక్షణ కోసం ఈ నెల 9న జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్,టీఎంయూ, ఎన్ఎంయూ కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆ సంఘాల నేతలు పిలుపునిచ్చారు. టీజీఎస్ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మధిర డిపోకు విచ్చేసిన ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్. బాబు, తెలంగాణ మజ్దూర్ యూనియన్ నాయకులు థామస్ రెడ్డి, నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు ఎం.డి. మౌలానా, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్మల జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు తదితరులు ఆర్టీసీ డిపో వద్ద ప్రచారం నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడారు. కార్మిక నాయకుని ముసుగులో అశ్వద్ధామ రెడ్డి కార్మికులకు తీరని ద్రోహం చేశారని వారు ఆరోపించారు. చారిత్రాత్మకమైన ఆర్టీసీ సమ్మె కాలంలో కార్మికుల ఐక్యతను, వారి రక్తమాంసాలను అడ్డంపెట్టుకుని కొందరు స్వార్థపరులు లబ్ది పొందారే తప్ప, కార్మికుల సమస్యల పరిష్కారానికి నోచుకోలేదని మండిపడ్డారు. కష్టకాలంలో కార్మికులకు అండగా ఉండాల్సిన నాయకత్వమే యాజమాంతంతో కుమ్మక్కై హక్కులను కాలరాసేలా వ్యవహరించిం దని విమర్శించారు. కార్మికుల జీతభత్యాలు, పీఆర్సీ మరియు పెండింగ్ డిమాండ్ల సాధనలో ఆయన పూర్తిగా విఫలమయ్యారని,ఆయన వ్యక్తిగత అజెండా వల్లే ఆర్టీసీ కార్మిక లోకం తీవ్రంగా నష్టపోయిందని స్పష్టం చేశారు. కార్మికుల ముసుగులో చలామణి అవుతూ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబించే నాయకులను ఇకపై సహించేది లేదని హెచ్చరించారు. ఇలాం టి నాయకులు యాజమాన్యంతో కుమ్మక్కు వ్వకపోతే ఇప్పటివరకు ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనమై ఆరు సంవత్సరాలు అయ్యేదని వారు గుర్తు చేశారు. గత పదేళ్లుగా ఆర్టీసీలో యూనియన్ ఎన్నికలు జరగలేదని, కార్మికుల హక్కులను కాలరాస్తూ, యూనియన్ల గొంతు నొక్కాలని చూసిన నాటి బీఆర్ఎస్ ప్రభుత్వమే ఇందుకు పూర్తిగా బాధ్యత వహించా లని దుయ్యబట్టారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ, అండగా నిలవాల్సిన యూనియన్లను అణగ దొక్కాలని చూసే ఏ ప్రభుత్వమైనా కాలగర్భంలో కలవాల్సిందేనని, చరిత్రలో అలాంటి ప్రభుత్వా లకు మనుగడ ఉండదని స్పష్టం చేశారు. కార్మి కులకు ఏ కష్టమొచ్చినా, ఏ అన్యాయం జరిగినా ఎల్లప్పుడూ అండగా ఉండి పోరాడేది ఎంప్లాయిస్ యూనియనేనని తెలిపారు.ఆర్టీసీ కార్మికులు మరియు కార్మిక సంఘాలు ఇప్పటికైనా అప్రమత్తమై, మోసపూరిత నాయకత్వాలను తిప్పికొట్టాలని వారు కోరారు.అక్టోబర్ 9న జరిగే ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్, టీఎంయూ, ఎన్ఎంయూ కూటమిగా ఏర్పడి పోటీ చేస్తున్నాయని తెలిపారు.ఇందులో భాగంగా ఖమ్మం రీజియన్ కూటమి కేటాయింపులో భాగంగా ఎన్ఎంయూ అభ్యర్థికి కాగడ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ బస్సు గుర్తుపై పోటీ చేస్తోందని, కార్మికులందరూ అధిక సంఖ్యలో బస్సు గుర్తుకు ఓటేసి రాష్ట్రస్థాయిలో అత్యధిక మెజారిటీతో విజయం సాధించేలా చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు తిమ్మినేని రామారావు, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాటి అప్పారావు,ఏఐటీయుసి జిల్లా కార్యదర్శి తోట రామాంజనేయులు,ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి చెరుకూరి వెంకటేశ్వరరావు, సిపిఐ బోనకల్లు మండల కార్యదర్శి యంగల ఆనందరావు,సిపిఐ జిల్లా సమితి సభ్యులు పెరుమాళ్లపల్లి ప్రకాష్ రావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్,ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 5 (జనంసాక్షి)** జిల్లాలో నేరాల నియంత్రణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన మంత్లీ క్రైమ్ రివ్యూ సమావేశంలో జిల్లాలో నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసుల పరిష్కారం, ప్రజా భద్రత తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. వివిధ పోలీస్ స్టేషన్లలో దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్‌గ్రేవ్, మిస్సింగ్, ఎన్‌బీడబ్ల్యు కేసుల పురోగతిని ఎస్పీ సమీక్షించారు. లాంగ్ పెండింగ్, మిస్సింగ్ కేసుల ఛేదనతో పాటు ఎన్‌బీడబ్ల్యు ఎగ్జిక్యూషన్‌పై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. గ్రేవ్ కేసుల్లో శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలను సేకరించి సమర్థవంత మైన దర్యాప్తు చేపట్టి నిందితులకు న్యాయ స్థానంలో శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**జూదంపై ఉక్కుపాదం**

జిల్లాలో జూదం నియంత్రణపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఎస్‌హెచ్‌ఓలను ఎస్పీ ఆదేశించారు. ఎక్కడైనా జూదం నిర్వహిస్తున్నట్లు లేదా ఆడుతున్నట్లు గుర్తిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జూదం కారణంగా అనేక కుటుంబాలు ఆర్థికంగా నష్టపోయి అప్పుల పాలవుతున్నందున, దీనిని అరికట్టేందుకు పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

**రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు**

జిల్లాలో తరచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను హాట్‌స్పాట్లుగా గుర్తించి, అవసరమైన చోట ప్రమాద సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయించాలని ఎస్పీ సూచించారు. జాతీయ రహదారులకు అనుసంధానంగా ఉన్న ప్రధాన రహదారులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు.

**సైబర్ నేరాలపై అప్రమత్తం చేయాలి**

ఆర్థిక, సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఎస్పీ తెలిపారు. సైబర్ మోసాలు, అనుమానాస్పద లావాదేవీలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

**నవరాత్రులకు పటిష్ట భద్రత**

దుర్గా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. ఉత్సవాలు జరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. రౌడీషీటర్లు, కేడీలు, అనుమానిత వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ప్రతి గ్రామంలో కమ్యూనిటీ సీసీ కెమెరాలు నేరాల నియంత్రణ, నేరాల ఛేదనలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలని ఎస్పీ సూచించారు. ప్రతి గ్రామంలోని ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లతో పాటు ప్రార్థనా స్థలాలు, పరిశ్రమలు, ధాబాలు, పెట్రోల్ బంకులు తదితర కీలక ప్రాంతాల్లో కమ్యూనిటీ సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ షీ టీమ్స్ నిరంతరం అప్రమత్తంగా పనిచేయాలని, మహిళలపై వేధింపులను అరికట్టడంతో పాటు మహిళా చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

**ఉత్తమ ప్రతిభకు నగదు రివార్డులు**

విధి నిర్వహణలో వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు రివార్డులు, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. పోలీస్ స్టేషన్ స్థాయిలో ఉత్తమ పనితీరు కనబరిచే అధికారులు, సిబ్బందిని గుర్తించి రివార్డులు, ప్రశంసాపత్రాల కోసం సిఫారసు చేయాలని ఎస్‌హెచ్‌ఓలకు సూచించారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ అడ్మిన్ కే. నర్సింహారెడ్డి, డీఎస్పీలు మధుసూదన్, శ్రీనివాసరావు, గట్టుమల్లు, విజయభాస్కర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ మురళి, జిల్లాలోని ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, రైటర్లు తదితరులు పాల్గొన్నారు.



# మధిర మిర్చి మార్కెట్ యార్డులో నిలిచిన కొనుగోళ్లు

వ్యాపారం సాగించాలనే కొందరి ధోరణి, ఇటు మార్కెట్ కమిటీ నిబంధనల నడుమ కొనుగోలు ప్రక్రియ ప్రతిష్టంభనకు గురవుతోంది.

**రైతుల ఆందోళన**

కొనుగోళ్లు నిలిచిపోతే లేదా ధర తగ్గితే మిర్చిని కోల్డ్ స్టోరేజీలలో దాచుకోవాల్సిన పరిస్థితి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి ఆశయానికి గండిరాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గ రైతాంగానికి మేలు చేకూర్చాలనే సంకల్పంతో మార్కెట్ యార్డు అభివృద్ధికి పెద్దపీట వేశారు.స్థానిక రైతులు ఖమ్మం, వరంగల్, గుంటూరు వంటి దూర ప్రాంతాలకు వెళ్లకుండా మధిరలోనే గిట్టుబాటు ధర దక్కాలనే ఉద్దేశంతో యార్డు కార్యకలాపాలను ప్రతిష్టాత్మకంగా ముందుకు తీసుకెళ్తున్నారు.అయితే క్షేత్రస్థాయిలో లైసెన్సుల వివాదం, పన్నుల సమస్యల పేరుతో కొనుగోళ్లను నిలిపివేసే వాతావరణం ఏర్పడటం ఆయన ఆశయానికి విఘాతం కలిగిస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా, అదే సమయంలో బయటి వ్యాపారులు స్వేచ్ఛగా వచ్చి పోటీపడి కొనుగోలు చేసేలా మార్కెట్ అధికారులు సమన్వయం సాధించాల్సి ఉంది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే జోక్యం చేసుకుని, బయ్యర్లు, దళారులు, మార్కెట్ కమిటీతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని, తద్వారా నిరంతరాయంగా మిర్చి కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతాంగం డిమాండ్ చేస్తోంది.

# అమెరికాలో రోడ్డు ప్రమాదంలో సుప్రియ మృతి చెందడం పట్ల మంత్రి పొంగులేటి తీవ్ర విచారం

**-మృతదేహాన్ని త్వరగా ఇండియా తీసుకొచ్చేందుకు..కృషి చేస్తున్నట్లు వెల్లడి**

**-మంత్రి సూచనలతో మృతురాలి నివాసానికి వెళ్లి.. కుటుంబ సభ్యులను ఓదార్చిన క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ దయాకర్ రెడ్డి**



**ఖమ్మం రూరల్, అక్టోబర్ 5 (జనంసాక్షి):** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని సింహాద్రి నగర్‌కు చెందిన దారం సుప్రియ అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సుప్రియ మృతిచెందిన విషయం తెలుసుకుని ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతదేహాన్ని వీలైనంత త్వరగా భారత్‌కు తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన చర్యలు వేగవంతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.

**-మృతురాలి కుటుంబ సభ్యులకు దయాకర్ రెడ్డి పరామర్శ.**

మంత్రి పొంగులేటి సూచనల మేరకు ఖమ్మం క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి సోమవారం సింహాద్రినగర్‌లోని సుప్రియ నివాసానికి వెళ్లారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డికి ఫోన్ చేయగానే.. మృతురాలి కుటుంబ సభ్యులతో స్వయంగా మాట్లాడి.. ఓదార్చారు. అలాగే.. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, అమెరికాలోని భారత రాయబార కార్యాలయ ఉన్నతాధికారులతో పలుమార్లు సంప్రదించానని, వీలైనంత త్వరగా మృతదేహాన్ని స్వదేశానికి రప్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్‌చైర్ పర్సన్ తమ్మినేని నవీన్, మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ కిషోర్, గరికపాటి ఆంజనేయ ప్రసాద్, పలువురు కౌన్సిలర్లు, స్థానిక కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా డైరెక్టర్‌గా పూర్ణచందర్ రాజు



**ఆత్మకూర్ (ఎం)జనంసాక్షి అక్టోబర్ (05)** జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ డైరెక్టర్‌గా ఆత్మకూరుకు చెందిన మాజీ జెడ్పీటీసీ ప్రతికంఠం పూర్ణచందర్ రాజు ఘన విజయం సాధించారు. రాయిగిరి జెడ్పీ పాఠశాలలో జరిగిన ఎన్నికల్లో ఆయన తన సమీప అభ్యర్థిపై 700 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. ఆయన విజయం పట్ల మండల రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు జెట్ట యాదగిరి, సర్పంచ్ సోలిపురం ఎల్లారెడ్డి, అజీమొద్దీన్, పంజాల కృష్ణమూర్తి, కొత్తకొండ శ్రీనివాస్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

# పత్తి ఎంఎస్ పి కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలి:కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం, అక్టోబర్ 05 (జనంసాక్షి)**
2026-27 సీజన్‌లో పత్తి కనీస మద్దతు ధర కు కొనుగోళ్లను సమర్థవంతంగా పర్యవేక్షిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు.
సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత శాఖల అధికారులతో పత్తి కనీస మద్దతు ధర కొనుగోళ్ల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా పత్తి సాగు విస్తీర్ణం, అంచనా దిగుబడి, కొనుగోలు కేంద్రాలు, రైతుల నమోదు, నాణ్యత ప్రమాణాలు, తేమ శాతం, వెయిమెంట్, చెల్లింపులు, భద్రత తదితర అంశాలపై సమీక్షించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ× కేంద్ర ప్రభుత్వం 2026-27 సీజన్‌కు పత్తి కనీస మద్దతు ధర (ఓూఖ)ను క్వింటాల్‌కు రూ. 8,667గా నిర్ణయించిందన్నారు. 2025-26 సీజన్‌లో క్వింటాల్‌కు రూ. 8,110 ఉండగా, ప్రస్తుతం రూ. 557 పెంచినట్లు తెలిపారు. మీడియం స్టేపుల్ పత్తికి క్వింటాల్‌కు రూ. 8,267, లాంగ్ స్టేపుల్ పత్తికి క్వింటాల్‌కు రూ. 8,667 మద్దతు ధరగా నిర్ణయించబడిందని తెలిపారు.
2026-27 సీజన్‌లో ఖమ్మం జిల్లాలో 2,35,637 ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. గత ఏడాది 2,25,613 ఎకరాల్లో పత్తి సాగు కాగా, ఈ ఏడాది 10,024 ఎకరాల మేర సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు.

**రైతుల వివరాలను కపాస్ కిసాన్ యాప్‌కు అనుసంధానం చేయాలి:**
పత్తి కొనుగోళ్లలో వ్యవసాయ శాఖ కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ సూచించారు. నిజమైన పత్తి రైతులను గుర్తించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. కౌలు రైతులను తాత్కాలికంగా డేటాబేస్‌లో నమోదు చేసే విధానాన్ని అమలు చేయాలని తెలిపారు.
పత్తి సాగు చేస్తున్న రైతుల వివరాలను ఎన్ఐసి ద్వారా కపాస్ కిసాన్ యాప్‌కు బదిలీ చేసే ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. అగ్రి స్టాక్‌ను కపాస్ కిసాన్ యాప్‌తో అనుసంధానం చేసి రైతుల వివరాలు, సేవల పంపిణీని మరింత సులభతరం చేసేందుకు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు, సిసిఐ సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
పత్తి కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అంతర్ జిల్లా మ్యాపింగ్ ప్రతిపాదనలను ముందుగానే ఖరారు చేసి సిసిఐ పరిశీలనకు పంపాలని కలెక్టర్ సూచించారు. కొనుగోళ్లు ప్రారంభమయ్యే నాటికి అవసరమైన అన్ని ప్రక్రియలను పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులు తమ పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకురాక ముందే తేమ శాతాన్ని పరిశీలించుకునేలా జిల్లాలోని 129 రైతు వేదికల్లో మాయిశ్చర్ మీటర్లు అందుబాటులో ఉంచాలని మార్కెటింగ్ శాఖను కలెక్టర్ ఆదేశించారు. తేమ శాతం అధికంగా ఉండటం వల్ల పత్తి తిరస్కరణకు గురికాకుండా రైతులకు ముందుగానే అవగాహన



కల్పించాలని సూచించారు.

**టోల్‌ఫ్రీ, వాట్సాప్ నంబర్లపై విస్తృత ప్రచారం:**
పత్తి కొనుగోళ్లకు సంబంధించి రైతుల సమస్యలను పరిష్కరించేందుకు 1800 599 5779 టోల్‌ఫ్రీ నంబర్, 88972 81111 వాట్సాప్ నంబర్‌ను కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి రైతుల సమస్యలను ప్రతిరోజూ ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు.ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమం ద్వారా పత్తి కొనుగోళ్లకు సంబంధించిన ఎఫ్ఏక్యూ ప్రమాణాలు, స్లాట్ బుకింగ్ విధానం, టోల్‌ఫ్రీ నంబర్, కొనుగోలు కేంద్రాల వివరాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. బ్రోచర్లు, వాల్ పోస్టర్లు, కర పత్రాలు, బ్యానర్లు, టీవీ చానళ్లతో పాటు బల్క్ మెసేజ్‌ల ద్వారా కూడా రైతులకు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు.

# పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదు కావాలి

## బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పిజిఆర్

**గుర్రంపోడు, అక్టోబర్ 5 (జనంసాక్షి):**



నల్గొండ?ఖమ్మం?వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పిజిఆర్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యలు, నిరుద్యోగం, విద్య, ఉద్యోగ అవకాశాలపై తమ గొంతు వినిపించేందుకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కీలకమన్నారు.ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు నవంబర్ 6 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నందున, అర్హులైన పట్టభద్రులు ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదుకు అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధంగా ఉంచుకుని ఎన్నికల సంఘం సూచించిన విధంగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.అర్హత ఉన్న ఒక్క పట్టభద్రుడు కూడా ఓటరు జాబితాలో మిగలకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహచరులకు కూడా ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని పిజిఆర్ కోరారు. పట్టభద్రులంతా ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.



# కాంగ్రెస్ పాలనలోనే మహిళా సాధికారత సాధ్యం

## ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి

**బెట్టల్ తండాలో ఘనంగా మహిళా సంఘం భవనం ప్రారంభోత్సవం**

**పెద్దవూర అక్టోబర్ 5 (జనంసాక్షి)**
కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి, వారి ఆత్మగౌరవానికి పెద్దపీట వేస్తోందని నాగార్జునసాగర్ శాసనసభ్యులు జయవీర్ రెడ్డి స్పష్టం చేశారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం కావడమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక విప్లవాత్మక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు.
పెద్దవూర మండల పరిధిలోని బెట్టల్ తండా గ్రామంలో సోమవారం నూతనంగా నిర్మించిన మహిళా సంఘం భవనాన్ని ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.
మహిళల ప్రగతికే ప్రాధాన్యం: మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుకు సాగేలా ప్రభుత్వం పూర్తి అండదండలు అందిస్తోంది.
పథకాల సద్వినియోగం: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకొని, సొంత వ్యాపారాలు, ఉపాధి మార్గాల ద్వారా ఆర్థికంగా ఉన్నత స్థాయికి ఎదగాలి. సాధికారతే ధ్యేయం మహిళా సాధికారతే ప్రధాన ధ్యేయంగా గ్రామస్థాయి వరకు స్వయం సహాయక సంఘాలకు బలాన్ని చేకూరుస్తున్నామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థుల అభ్యసనకు అనుకూల వాతావరణం కల్పించాలి : కలెక్టర్ అంకిత్

## ఎస్ఏ-1 పరీక్షల నిర్వహణను పరిశీలించిన కలెక్టర్

## ప్రీ-ప్రైమరీ చిన్నారులకు అందుతున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజన అమలు పరిశీలన



**భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్05 (జనంసాక్షి):**
జూలూరుపాడు మండలం కొమ్ముగూడెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, పరీక్షల నిర్వహణ, విద్యార్థుల హాజరు, మౌలిక సదుపాయాలు, పోషకాహారం తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్ఏ?1 పరీక్షలను కలెక్టర్ పరిశీలించారు. వివిధ తరగతుల విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును గమనించి, వారు రాస్తున్న ప్రశ్నపత్రాలను పరిశీలించారు. పరీక్షల నిర్వహణ విధానం, విద్యార్థుల అభ్యసన స్థాయి తదితర వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.
పాఠశాలలో మొత్తం 73 మంది విద్యార్థులు ఉండగా, సోమవారం 62 మంది విద్యార్థులు హాజరైనట్లు ఉపాధ్యాయులు కలెక్టర్‌కు వివరించారు. విద్యార్థుల హాజరు శాతం మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని, గైర్హాజరవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో సమన్వయం చేసుకొని వారు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని కలెక్టర్ సూచించారు.పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించిన కలెక్టర్, 'మన ఊరు?మన బడి' కార్యక్రమం కింద పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో చేపట్టిన పనులు, వాటి ప్రస్తుత పరిస్థితి, విద్యార్థులకు వాటి ద్వారా కలుగుతున్న ప్రయోజనాలపై వివరాలు తెలుసుకున్నారు.
అనంతరం పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ప్రీ-ప్రైమరీ పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. అక్కడ 14 మంది చిన్నారులు విద్యనభ్యసిస్తున్నట్లు తెలుసుకున్న ఆయన, వారికి అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. చిన్నారులకు నూతనంగా అందించనున్న ఏకరూప దుస్తులను పరిశీలించారు. వారి వయస్సుకు అనుగుణంగా విద్యాబోధన జరుగుతున్న తీరును, చిన్నారులకు కల్పిస్తున్న అభ్యసన వాతావరణాన్ని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.
చిన్నారులు ఆటల ద్వారా ఉల్లాసంగా నేర్చుకునేలా పాఠశాలలో ఏర్పాటు చేసిన బొమ్మలు, ఆట వస్తువులను కలెక్టర్ పరిశీలించారు. తరగతి గదుల్లో పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాలని, ఆటలు, బొమ్మలు, ఇతర అభ్యసన సామగ్రిని వినియోగిస్తూ చిన్నారుల్లో ఆసక్తిని పెంపొందించాలని సూచించారు.
విద్యార్థులకు అందిస్తున్న పోషకాహారంపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. ఉదయం 11 గంటలకు రాగిజావ, అనంతరం మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు ఉపాధ్యాయులు వివరించారు. మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, మెనూ, ఆహార పదార్థాలు, వంటశాల పరిశుభ్రత తదితర అంశాలను వంట నిర్వాహకురాలిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన, పోషక విలువలతో కూడిన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.
పాఠశాలలో విద్యార్థులకు అభ్యసనకు అనుకూలమైన వాతావరణం కల్పించడంతో పాటు వారి హాజరు, విద్యా ప్రమాణాలు, ఆరోగ్యం, పోషకాహారంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన తెలిపారు .ఈ తనిఖీలు కలెక్టర్ వెంట తాసిల్దార్ శ్రీనివాస్, ఎంఈఓ జుంకీ లాల్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి

# జర్నలిస్టుల ఆరోగ్య రక్షణకు క్యాష్ లెస్ హెల్త్ కార్డులు ఇవ్వాలి

**○సీఎం రేవంత్ రెడ్డికి పోస్టుకార్డులు రాసిన జర్నలిస్టులు**

**○టీయుడబ్ల్యుజె హెచ్143 ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం**



**సూర్యాపేట (జనంసాక్షి):**
రాష్ట్రంలో ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడంలో ప్రధాన భూమిక పోషిస్తున్న జర్నలిస్టులు నేడు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారని టీయుడబ్ల్యూజె హెచ్143 జిల్లా అధ్యక్షులు వజ్జె వీరయ్యయాదవ్ అన్నారు.జర్నలిస్టుల హెల్త్ కార్డులను పునరుద్ధరించి క్యాష్ లెస్ హెల్త్ కార్డులు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ టీయుడబ్ల్యూజె హెచ్143 ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని వాణిజ్యభవన్ సెంటర్ లో సీఎం రేవంత్ రెడ్డికి పోస్టుకార్డుల ఉద్యమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల క్యాష్ లెస్ హెల్త్ కార్డులను పునరుద్ధరించాలని, నూతన జర్నలిస్టులకు కూడా హెల్త్ కార్డులు ఇవ్వాలని అన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా టీయూడబ్ల్యుజె హెచ్143 నాయకులు అల్లం నారాయణ ఆధ్వర్యంలో ఈ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని అన్నారు.ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రభుత్వాలను నిలబెట్టడంలో ప్రధాన భూమిక పోషించే జర్నలిస్టుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు అవసరమైన జర్నలిస్టుల హెల్త్ కార్డుల విషయంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి క్యాష్ లెస్ హెల్త్ కార్డులను పునరుద్ధించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.లేని పక్షంలో భవిష్యత్తులో దశల వారీగా ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు.239 జీవో ప్రకారం అందరికి అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు క్యాష్ లెస్ హెల్త్ కార్డులు అమలు చేసి జర్నలిస్టుల పక్షపాతిగా ఉండాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆ సంఘ ప్రతినిధులు గుండా శ్రీనివాసగుప్తా, పెద్దింటి శ్యాంసుంధర్ రెడ్డి, చల్లా చంద్రశేఖర్, పాలవరపు శ్రీనివాస్, గునగంటి సురేష్, అమరగాని నాగేందర్, రాపర్తి మహేష్, దేవరగట్ల సతీష్, చౌగాని నరేందర్, గుగులోతు వీరన్న, ఉట్కూరి రవిందర్, బంధు వీరయ్య, మదూరి బ్రహ్మచారి, బచ్చు పురుషోత్తం, జహంగీర్, బొజ్జ ఎడ్వర్డ్, వల్దాస్ ప్రవీణ్, నిదుర శ్రవణ్, శరత్, యాకయ్య, రామాచారి, దుర్గం బాలు, పిన్నెల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత మహిళ పై దాడి హేయనియమైన చర్య..!

**- దాడి చేసిన వారిని చట్టపరంగా శిక్షించాలని డిమాండ్**

**- టీఎస్ ఎమ్మార్పీఎస్ పి.ఏ.పల్లి మండల అధ్యక్షుడు రమణనీపల్లి వెంకటయ్య**



**పి.ఏ.పల్లి,అక్టోబరు 05,(జనంసాక్షి)**
చింతపల్లి మండలం పీకే మల్లేపల్లి గ్రామంలో అక్టోబర్ రెండో తారీఖున గ్రామసభ జరుగుతుండగా ఒక దళిత మహిళపై కులం పేరుతో దూషించి నానా బూతులు తిడుతూ కొట్టి కింద పడేసిన కొప్పోలు అమర్నాథ్ గౌడ్ ను తక్షణమే అరెస్టు చేసి రిమాండ్ కు తరలించాలని పి.ఏ.పల్లి టీఎస్ ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షుడు రమణంపల్లి వెంకటయ్య డిమాండ్ చేశారు. మాదిగలపై దాడులను అరికట్టకపోతే ఇలాంటివి ఇంకా ఎన్నో దాడులు జరిగే ప్రమాదం ఉందంటూ ఆయన ధ్వజమెత్తారు.ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చూసే బాధ్యత ప్రభుత్వాలు తీసుకోవాలని ఆయన అన్నారు. బాధిత కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలని ప్రభుత్వాలు కఠినమైన చట్టాలను తీసుకువచ్చి ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని ఆయన కోరారు.

# రైతన్నల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది: ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి

**పెద్దవూరలో ప్రాథమిక సహకార సంఘం భవనం ప్రారంభం**



పెద్దవూర అక్టోబర్ 5 (జనంసాక్షి )
రైతుల సంక్షేమానికి తమ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని నాగార్జునసాగర్ నియోజకవర్గ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం పెద్దవూర మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) భవనాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడూతూ... గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు సేవలందించడంలో సహకార సంఘాలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. రైతన్నలకు అవసరమైన వ్యవసాయ రుణాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల పంపిణీ, పంటల కొనుగోలుతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల సమాచారాన్ని ఈ కేంద్రాల ద్వారా వేగంగా చేరువ చేస్తామన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి రైతు భరోసా, పంట రుణమాఫీ, సన్న వడ్లకు రూ.500 బోనస్, ఉచిత విద్యుత్ వంటి అనేక చారిత్రాత్మక పథకాలను అమలు చేస్తూ రైతాంగానికి కొండంత అండగా నిలుస్తోందని కొనియాడారు. రైతుల శ్రేయస్సే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అందుబాటులోకి వచ్చిన సహకార సంఘం సేవలను ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్ రెడ్డి, స్థానిక సర్పంచ్ వెంకటయ్య గౌడ్, కాంగ్రెస్ నాయకులు పబ్బు యాదగిరి గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ ఖాసీం, ఎంపీడీవో ఉమాదేవిలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు, విరివిగా రైతులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం నాదే

**నిరుద్యోగ జాక్ అధ్యక్షులు పాలకూరి అశోక్**



**నల్లగొండ ప్రతినిధి,అక్టోబర్ 05,(జనం సాక్షి):**
ఖమ్మం-వరంగల్-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు పాలకూరి అశోక్ ప్రకటించారు. సోమవారం నల్లగొండలోని ఎస్పీఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు గట్టి పోటీ ఇచ్చానని, ఈసారి విజయం తనదేనని ధీమా వ్యక్తం చేశారు.నిరుద్యోగులు, బీసీలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సమస్యలపై 15 ఏళ్లుగా పోరాడుతున్నానని తెలిపారు. తెలంగాణ బిడ్డలకు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల కల్పనే తన ప్రధాన ఎన్నికల నినాదమన్నారు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని, విద్యా, వైద్యాన్ని ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కె.వి.గౌడ్, ప్రణీత్, నవీన్‌రెడ్డి, కిరణ్, రవి కొండల్, మహేష్, సురేష్, సంధ్య, ఇందు తదితరులు పాల్గొన్నారు.

## చిల్పకుంట్ల డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ

**నూతనకల్ అక్టోబర్ 5 ( జనంసాక్షి)**
మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామపంచాయతీలో గత ఏడు సంవత్సరాల క్రితం కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు లాటరీ పద్ధతిలో పంపిణీ చేశామని ఎంపీడీవో సునీత తెలిపారు.ఈ సందర్భంగా సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి చిల్పకుంట్ల డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించిన, యల్ 2 లిస్టులో ఉన్న 113 మందికి గాను గెజిటెడ్ ఆఫీసర్స్ తనిఖీ లొ 30 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి లాటరీ పద్దతిలో వారికీ లేఔట్ మ్యాప్ ప్రకారం నంబర్స్ ఇవ్వటం జరిగింది.ఈ కార్యక్రమం లొ హోసింగ్ పీడీ ఎండీ జబ్బార్ తహసీల్దార్ పి. శ్రీనివాసరావు, ఎంపీవో హరి సింగ్ పంచాయతీ కార్యదర్శి గంగరాజు, హోసింగ్ ఏఈ సాయి సింహ, ఎస్సై నాగరాజు అధికారులు,లబ్ధిదారులు పాల్గొనినారు.



## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట (జనంసాక్షి):**
ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం జరిగే ప్రజావాణికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని,ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, మండల స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు.ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు.ప్రతి అధికారి తమ లాగిన్ లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, లేనియెడల వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.మండల స్థాయి సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని పేర్కొన్నారు.మొత్తం 86 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, డిఎంహెచ్వో వెంకటరమణ, డిఏఓ శ్రీధర్ రెడ్డి, జిల్లా స్పోర్ట్స్ అండ్ యూత్ వెల్ఫేర్ అధికారి వెంకటరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి ఉపేందర్, మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి , జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు తీపి కబురు

**ఇకపై 24 గంటల ఉచిత, నాణ్యమైన విద్యుత్ సరఫరా**



పెద్దవూర అక్టోబర్ 5 (జనంసాక్షి )
మండల పరిధిలోని వ్యవసాయదారుల దశాబ్దాల కష్టాలకు తెరకలిగింది.
అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా రైతులకు నిరంతరాయంగా 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు వెల్లడించారు. సాంకేతిక లోపాలను సరిదిద్ది, సబ్‌స్టేషన్ల ఆధునీకరణ ద్వారా అవాంతరాలు లేని విద్యుత్ సరఫరాకు శ్రీకారం చుట్టారు.ఇటీవల కొన్ని ప్రాంతాల్లో ఎదురైన లో-వోల్టేజ్ సమస్యలు, సాంకేతిక అంతరాయాలపై అధికారులు తక్షణమే స్పందించారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, స్టార్టర్లు, మోటార్లు కాలిపోకుండా నివారించేలా వోల్టేజ్ స్థిరీకరణ చర్యలు పూర్తి చేశారు.ఈ నిర్ణయం పట్ల పెద్దవూర మండల రైతాంగం తీవ్ర హర్షం వ్యక్తం చేస్తోంది. వేళాపాళా లేని విద్యుత్ కోతల భయం వీడటంతో పాటు, పంటలకు సమయానుకూలంగా నీళ్లు పారించుకునే వెసులుబాటు కలిగిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యమైన విద్యుత్ అందడంతో ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు పాడయ్యే ఖర్చులు తగ్గి రైతులకు ఆర్థికంగా పెద్ద ఊరట లభించింది.వ్యవసాయాన్ని పండగలా మార్చేందుకు ప్రభుత్వం, అధికారులు చూపిస్తున్న చొరవపై స్థానిక రైతులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజావాణి ఫిర్యాదుల పెండెన్సీ తగ్గించాలి: కలెక్టర్ చంద్ర శేఖర్

**నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 5,(జనంసాక్షి):** అన్ని స్థాయిల్లో ప్రజావాణి ఫిర్యాదుల పెండెన్సీని తగ్గించి, ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.మండల, డివిజన్ స్థాయిల్లో స్థానిక సంస్థలు, రెవెన్యూ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. వాటిపై ప్రత్యేక దృష్టి సారించి త్వరగా పరిష్కరించాలని డీఆర్వో దశరథ్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డిని ఆదేశించారు.హాస్టళ్ల తనిఖీలు నిర్వహించి నివేదికలు సమర్పించాలని, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలోని 11 అంశాలపై సాధించిన లక్ష్యాల నివేదికను ఈనెల 6లోగా అందించాలని సూచించారు. త్వరలో జరగనున్న దిశ సమావేశానికి అవసరమైన నివేదికలను సమర్పించాలన్నారు. సీఎం కార్యాలయం, ప్రజాప్రతినిధులు, వీఐపీలు, చీఫ్ సెక్రటరీ, ప్రజావాణి, సీపీఆర్వో ద్వారా వచ్చిన రిఫరెన్సులపై తీసుకున్న చర్యలను రాతపూర్వకంగా తెలియజేయాలని ఆదేశించారు.వార్తాపత్రికల్లో ప్రచురితమయ్యే ప్రతికూల వార్తలపై సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించి, తీసుకున్న





చర్యలు లేదా వివరణను సమర్పించాలన్నారు. సెప్టెంబర్ నెల పర్యటన వివరాలను కూడా తక్షణమే అందించాలని సూచించారు.

**ఆర్టీఐ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి:**

అక్టోబర్ 5 నుంచి 12 వరకు సమాచార హక్కు చట్టంపై అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న ఆర్టీఐ దరఖాస్తులు, అప్పీళ్ల వివరాలను నిర్దేశిత ప్రొఫార్మాలో అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్టీఐ కింద వచ్చిన దరఖాస్తులను పారదర్శకంగా, ఎప్పటి కప్పుడు పరిష్కరించాలని సూచించారు. త్వరలో ప్రారంభం కానున్న పత్తి, ధాన్యం సేకరణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాల వినియోగం పెరుగుతున్నందున నీటి పొదుపు, సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తాగునీటి పైప్‌లైన్ లీకేజీలను వెంటనే అరికట్టాలని, వాల్టా అనుమతి లేకుండా కొత్త బోర్లకు అనుమతులు ఇవ్వవద్దని స్పష్టం చేశారు. గ్రామాల్లో తాగునీటి కొరత ఏర్పడితే అవసరమైన నీటి వనరులను అద్దెకు తీసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈనెల 8లోగా చేయూత పెన్షన్ దరఖాస్తులను పరిశీలించి పంపించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టంపై రూపొందించిన ప్రతిజ్ఞను కలెక్టర్ అధికారులతో చేయించారు.

**141 ఫిర్యాదులు స్వీకరణ:**

సోమవారం ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు 55, ఇతర శాఖలకు 86 కలిపి మొత్తం 141 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి, డీఆర్డీఓ శేఖర్ రెడ్డి, డీఆర్వో దశరథ్, జిల్లా అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

# తాత్కాలిక మెరిట్ జాబితాలపై అభ్యంతరాలకు అవకాశం

## ఐటీడీఏ పీవో బి.రాహుల్

**భద్రాచలం అక్టోబరు 05 (జనంసాక్షి)**

ఖమ్మం రీజియన్ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2026?27 విద్యా సంవత్సరానికి తాత్కాలిక ప్రాతిపదికన బోధన సిబ్బంది నియామకానికి సంబంధించి తాత్కాలిక మెరిట్ జాబితాలను విడుదల చేసినట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ తెలిపారు.బోధన సిబ్బంది నియామకానికి అభ్యర్థుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి, వారు సమర్పించిన వివరాలు, అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా తాత్కాలిక మెరిట్ జాబితాలను సిద్ధం చేసినట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ పేర్లు, విద్యార్హతలు, మెరిట్, టెట్ లేదా ఇతర సంబంధిత వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే తగిన ఆధారాలతో సమర్పించాలని కోరారు.

**- అభ్యంతరాలకు చివరి గడువు 6వ తేదీ**

అభ్యంతరాలను అక్టోబరు 6వ తేదీ వరకు కార్యాలయ పనిదినాల్లో ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయం (గురుకులం), ఐటీడీఏ, భద్రాచలంలో నేరుగా సమర్పించాల్సి ఉంటుందని రాహుల్ తెలిపారు. అభ్యంతరాలతో పాటు సంబంధిత ధ్రువపత్రాల నకళ్లను తప్పనిసరిగా జత చేయాలని సూచించారు. నిర్ణీత గడువు అనంతరం అందే అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు. అందిన అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం అర్హత, నియామక నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు.మరిన్ని వివరాలకు 9949723291 చరవాణి నంబర్‌ను సంప్రదించాలని అభ్యర్థులకు సూచించారు.



# పోలీస్ సిబ్బందికి ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాలు

**నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 5,(జనంసాక్షి):**

పోలీస్ విధుల్లో పారదర్శకత, క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ పోలీస్ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని సూచించారు.సోమవారం పోలీస్ అధికారులు, ఎస్‌హెచ్‌ఓలు, సిబ్బందితో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో శాంతిభద్రతలు, నేర నియంత్రణ, రాత్రి గస్తీ, వాహనాల తనిఖీలు, చెక్‌పోస్టులు, ఎన్‌ఫోర్స్‌మెంట్, విలేజ్ పోలీసింగ్ తదితర అంశాలను ఎస్పీ సమీక్షించారు.పోలీస్ విధుల్లో రాజకీయ, వ్యక్తిగత లేదా ఇతర ప్రభావాలకు తావులేకుండా చట్టప్రకారం అందరికీ సమానంగా న్యాయం జరిగేలా వ్యవహరించాలన్నారు. పోలీస్ శాఖలో అవినీతిని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. వాహనాల తనిఖీలు, చెక్‌పోస్టులు, నైట్ పెట్రోలింగ్, కేసుల దర్యాప్తు సమయంలో డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చినా తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు.జిల్లాలో పగలు, రాత్రి నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ అక్రమ, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టాలని ఆదేశించారు. రాత్రి విధుల్లో ఉన్న సిబ్బంది అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, కార్యకలాపాలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు.గ్రామస్థాయిలో విలేజ్ పోలీస్ ఆఫీసర్ల ద్వారా ముందస్తు సమాచారాన్ని సేకరించి నేరాలు, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని ఎస్‌హెచ్‌ఓలకు సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం, అలసత్వం, క్రమశిక్షణా రాహిత్యాన్ని ఉపేక్షించబోమని హెచ్చరించారు. పోలీస్ శాఖ ప్రతిష్ట, ప్రజల విశ్వాసాన్ని కాపాడేలా ప్రతి ఒక్కరూ నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు.



# గిరిబోయినగూడెంలో నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలి

**❑సర్పంచ్, ఉప సర్పంచ్‌ల నిర్లక్ష్యంపై కలెక్టర్‌కు గ్రామస్తుల ఫిర్యాదు**

**❑ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు, ప్రైవేటు భూముల్లో ప్రభుత్వ నిధులతో రోడ్లు**

**మోటకొండూరు,జనం సాక్షి (అక్టోబరు 5):** మోటకొండూరు మండలములోని గిరిబోయిన గూడెం గ్రామపంచాయతీ పరిధిలో ప్రభుత్వ నిధుల వినియోగం, అభివృద్ధి పనుల్లో భారీ అవకతవకలు జరిగాయని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజా వాణిలో ఫిర్యాదు చేశారు. సర్పంచ్, ఉపసర్పంచ్‌ల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.



**గ్రామసభకు డుమ్మా**

అక్టోబర్ 2న నిర్వహించిన గ్రామసభకు ప్రజలు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరైనప్పటికీ సర్పంచ్, ఉప సర్పంచ్ గైర్హాజరయ్యారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వారు ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని ఆరోపించారు.

**ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని గ్రామస్తులు ఆరోపించారు. పనులకు హాజరుకాని వారి పేర్లతో మస్టర్లు వేయడం, పనులు చేయకుండానే తప్పుడు బిల్లులు సృష్టించి చెల్లింపులు తీసుకున్నారని, రికార్డులను పరిశీలిస్తే వాస్తవాలు బయటపడతాయని తెలిపారు.

**నిధులపై ప్రత్యేక ఆడిట్ చేయాలి**

2019-2024 మధ్య కాలంలో గ్రామ పంచాయతీకి వచ్చిన నిధుల వినియోగంపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని కోరారు. ప్రైవేట్ వ్యక్తుల భూముల్లో ప్రభుత్వ నిధులతో రోడ్లు నిర్మించారని, దీనిపై రెవెన్యూ రికార్డుల ఆధారంగా విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేసిన నిధులను రికవరీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

**ప్రభుత్వ రోడ్డుకు అడ్డంగా కంచె**

ప్రజల రాకపోకల కోసం నిర్మించిన రోడ్డుకు అడ్డంగా కంచె వేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి కంచెను తొలగించి రోడ్డును అందుబాటులోకి తేవాలని కోరారు.

**ముదిరాజ్‌లకు అన్యాయం**

గిరిబోయినగూడెం మదిర గ్రామం మెడికుంటపల్లి చెరువు విషయంలో స్థానిక ముదిరాజ్ మత్స్యకారులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. స్థానికులకు కాకుండా వేరే వ్యక్తికి చెరువును అప్పగించారని, ఇందులో సర్పంచ్, ఉప సర్పంచ్, కార్యదర్శి పాత్ర ఉందన్న అనుమానాలు వ్యక్తం చేశారు. దీనిపై విచారణ జరిపి మత్స్యకారులకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు సమర్పించిన వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కొంతం వెంకటరెడ్డి, గిరబోయిన మల్కయ్య, కొత్తపేట విట్టల్, కొత్తపేట అంజయ్య, కొత్తపెల్లి నరసయ్య, కొత్తపేట చంద్రయ్య, కొత్తపేట స్వామి, గిరిబోయిన గోపి, బోల్ల వినోద్ తదితరులు పాల్గొన్నారు.





# వైరా వ్యవసాయ మార్కెట్ యార్డులో పెసలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

## మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్



**వైరా జనం సాక్షి**

అక్టోబర్ 5న ఖమ్మం జిల్లా వైరా వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెసలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభించేలా కొనుగోలు కేంద్రాల ద్వారా పంటలను సక్రమంగా కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. రైతులు దళారులనుఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వినియోగించు కోవాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని, పంట తూకం, నాణ్యత పరిశీలన, కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, మార్కెట్ కమిటీ అధికారులు, మార్క్‌ఫెడ్ సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. రైతులకు పంట విక్రయ సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకునేలా సహకారం అందించాలని నాయకులు సూచించారు. వైరా వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కావడంతో పరిసర ప్రాంతాల రైతులు తమ పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించుకోవాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్కు ఫెడ్ వైస్ చైర్మన్ బొర్ర రాజశేఖర్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు , పిసిసి మెంబర్ వడ్డే నారాయణరావు, కిసాన్ సెల్ ఉపాధ్యక్షులు దాసరి దానియేలు, ఆత్మ కమిటీ చైర్మన్ మట్టూరి వెంకటేశ్వరరావు, ఏన్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాపా సుధాకర్, లచ్చి రామ్ నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వీరంశెట్టి సీతారాములు , జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి పమ్మి అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి పణితి శ్రీనివాస్ రావు, మచ్చా వెంకటేశ్వరరావు, సర్పంచులు మన్నెం హనుమంతరావు, మేడూరి రామారావు, జవ్వాజి అశ్విని, మరియు నాయకులు తెళ్ళూరి వీరయ్య, షేక్ సైదా, ధర్నా రాజశేఖర్, మోర్ శ్రీకాంత్, తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుడుగునూరి లక్ష్మారెడ్డి, కొణిజర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు సవాళ్ల నాగేశ్వరరావు, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు అబ్బూరి నరహరి, మరియు ×మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మోత్కూరు వెంకటేశ్వరరావు, ఎస్.కె మౌలాలి, జాలాది తిరుపతిరావు, ఐ వి నాగేశ్వరరావు, రేచర్ల సత్యం, రేచర్ల మల్లేశ్వరి, బానోత్ మురళీకృష్ణ, తోటకూర నాగేశ్వరరావు, పొట్టపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.




# గ్రాడ్యుయేట్ ఓటర్ నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలి

## బీఆర్ఎస్ జిల్లా నాయకులు సంకుబాపన అనుదీప్

**భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 05 ( జనంసాక్షి)**

ఉమ్మడి ఖమ్మం-వరంగల్-నల్గొండ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి గ్రాడ్యుయేట్ ఓటర్ నమోదు ప్రక్రియను సులభతరం చేసేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత గ్రాడ్యుయేట్ ఓటర్ నమోదు కేంద్రాన్ని బీఆర్ఎస్ జిల్లా నాయకులు సంకుబాపన అనుదీప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అనుదీప్ మాట్లాడుతూ, గ్రాడ్యుయేట్ ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో కీలకమైనదని పేర్కొన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులకు సంబంధించిన ప్రభుత్వ విధానాలపై తమ అభిప్రాయాలను ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యక్తం చేసేందుకు గ్రాడ్యుయేట్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. "గ్రాడ్యుయేట్ ఓటు కేవలం ఓటు మాత్రమే కాదు.. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే ప్రజాస్వామ్య హక్కులో ఒక ముఖ్యమైన సాధనం" అని ఆయన అన్నారు.

అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ తమ ఓటును తప్పనిసరిగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఓటర్ నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించడంతో పాటు, నమోదు ప్రక్రియను సులభతరం చేసేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉచిత నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అర్హత కలిగిన గ్రాడ్యుయేట్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని అనుదీప్ కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బానోత్ రాందాస్, గుమ్మడి సాగర్, పూల రవీందర్, బోనగిరి శ్రీకాంత్, అలాగే బావు సతీష్, రామంచి శ్రీనివాస్, కళాకోటి ఐలయ్య, తాతారావు, బేతాళ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు మెరుగైన వైద్యం

## - ఐటీడీఏ నిధులతో రూ.15 లక్షల విలువైన వైద్య పరికరాలు అందజేత

**భద్రాచలం అక్టోబరు 05 (జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- నాలుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల పేద ప్రజలకు వైద్య సేవలందిస్తున్న భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి ఐటీడీఏ నిధులతో రూ.15 లక్షల విలువైన ఆధునిక వైద్య పరికరాలను అందించారు. సోమవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజశేఖర్‌రెడ్డి కి భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీవో బి.రాహుల్ పరికరాలను అందజేశారు. కంటి పరీక్షల పరికరం, రక్త పరీక్షల యంత్రం, ఈసీజీ యంత్రం, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, ట్రేలు, ఆక్సిజన్ సిలిండర్లు తదితర పరికరాలను ఆసుపత్రికి సమకూర్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రికి ఆధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని అన్నారు. భద్రాచలం ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసి నాలుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అందుబాటులోకి వచ్చిన పరికరాలను సద్వినియోగం చేసుకుని రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. ఐటీడీఏ పీవో బి.రాహుల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు, వైద్య సదుపాయాల మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కొత్త పరికరాలతో భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌వో సైదులు, ఐసీయూ ఇన్‌చార్జి డాక్టర్ జగదీష్, డాక్టర్ మల్లేష్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



# కేటీపీఎస్ VII అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ ఉద్యోగులకు మానసిక ఒత్తిడి ఎందుకు?

## కొల్లి దుర్గా నాగ మల్లేశ్వరి వ్యవహారశైలిపై ఉద్యోగుల ఆందోళన.. సీఎం తక్షణమే స్పందించాలి

**కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్ 5 (జనంసాక్షి):**

జేటీపీఎస్ VII దశలోని అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు తీవ్ర మానసిక ఒత్తిడి, పని సంబంధిత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటూ ఫిర్యాదులు, ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని ది నేషనల్ అంబేద్కర్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తాలూకా రాజేష్ తెలిపారు. ప్రస్తుతం జాయింట్ సెక్రటరీగా పనిచేస్తున్న కొల్లి దుర్గా నాగ మల్లేశ్వరి వ్యవహారశైలి, అధికార వినియోగం కారణంగా అడ్మిన్ బ్లాక్‌లోని కొంతమంది కింది స్థాయి ఉద్యోగులు మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఆరోపణలు వాస్తవమా, కాదా అన్నది యాజమాన్యం నిష్పక్షపాతంగా విచారణ చేసి వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. చెరుకు అశోక్ అస్వస్థతపై విచారణ చేయాలిఇటీవల జేఏఓగా విధులు నిర్వహిస్తున్న చెరుకు అశోక్ కళ్లు తిరిగి కిందపడిపోయిన ఘటన ఉద్యోగుల్లో ఆందోళన కలిగించిందని రాజేష్ తెలిపారు. ఈ ఘటనకు పని ఒత్తిడి, మానసిక ఒత్తిడి లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే విషయాన్ని యాజమాన్యం వెంటనే పరిశీలించాలని కోరారు. గతంలో ఇదే ప్రాంతంలో పనిచేసిన మరో అశోక్ తీవ్ర మానసిక ఒత్తిడికి గురై మరణించినట్లు ఉద్యోగుల్లో ఆందోళనలు ఉన్నాయని, అధికారులు వీటిని నిర్లక్ష్యం చేయకుండా అందుబాటులో ఉన్న రికార్డులు, ఫిర్యాదులు, వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి ఒకే ప్రాంతంలో కొనసాగుతున్న అధికారులపై సమీక్ష అవసరంకేటీపీఎస్ VIIలో కొంతమంది అధికారులు, ఉద్యోగులు ఏళ్ల తరబడి పాల్వంచలోనే కొనసాగుతున్నారనే ఆరోపణలు ఉన్నాయని రాజేష్ తెలిపారు. బదిలీ ఉత్తర్వులు వచ్చినప్పటికీ వివిధ కారణాలతో రిలీవ్ కాకుండా ఇక్కడే కొనసాగుతున్నారనే ఫిర్యాదులు కూడా ఉన్నాయని అన్నారు. కొంతమంది అధికారులు హైదరాబాద్‌లోని ఉన్నతాధికారులతో ఉన్న పరిచయాలు లేదా ప్రభావం ద్వారా పోస్టింగులు, బదిలీలు, ప్రమోషన్ల విషయంలో ప్రయోజనాలు పొందుతున్నారనే ఆరోపణలు ఉంటే, అవి నిజమా కాదా అన్నది రికార్డుల ఆధారంగా సమగ్రంగా పరిశీలించాలని కోరారు. ఎవరిపైనా వ్యక్తిగతంగా వ్యతిరేకంగా వ్యవహరించడం తమ ఉద్దేశం కాదని, నిబంధనలు అందరికీ సమానంగా అమలు కావాలన్నదే తమ డిమాండ్ అని తాలూకా రాజేష్ స్పష్టం చేశారు. ఉద్యోగులకు భద్రత, గౌరవప్రదమైన వర్కింగ్ ఎన్విరాన్‌మెంట్ కల్పించాలిప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు భయంతో లేదా మానసిక ఒత్తిడితో విధులు నిర్వహించే పరిస్థితి ఉండకూడదని ఆయన అన్నారు. అందువల్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, టీజీ జెన్‌కో యాజమాన్యం తక్షణమే జోక్యం చేసుకుని కేటీపీఎస్ VII అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లోని ఉద్యోగుల ఫిర్యాదులను స్వీకరించి విచారణ చేయాలని కోరారు. కొల్లి దుర్గా నాగ మల్లేశ్వరి వ్యవహారశైలిపై వచ్చిన ఆరోపణలను నిష్పక్షపాతంగా పరిశీలించాలని, ఉద్యోగులపై మానసిక లేదా శారీరక ఒత్తిడి ఉందా అనే అంశాన్ని



విచారించాలని డిమాండ్ చేశారు. జేఏఓ చెరుకు అశోక్ అస్వస్థతకు సంబంధించిన పరిస్థితులతో పాటు, గతంలో జరిగిన అశోక్ మరణానికి సంబంధించిన పరిస్థితులను కూడా అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా పరిశీలించాలని కోరారు. దీర్ఘకాలిక పోస్టింగులు, బదిలీలు, రిలీవింగ్, ప్రమోషన్లను నిబంధనల ప్రకారం సమీక్షించాలని, నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. ఫిర్యాదు చేసిన ఉద్యోగులపై ఎలాంటి ప్రతీకార చర్యలు లేకుండా రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. "ఉద్యోగుల ప్రాణాలు, ఆరోగ్యం, ఆత్మగౌరవం కంటే ఏ అడ్మినిస్ట్రేటివ్ వ్యవహారం కూడా గొప్పది కాదు. కేటీపీఎస్ VII అడ్మినిస్ట్రేషన్ శాఖలోని ఉద్యోగులు ఎదుర్కొంటున్నారని చెబుతున్న సమస్యలను ఇకపై నిర్లక్ష్యం చేయకుండా, వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి ఉద్యోగులకు న్యాయం చేయాలి" అని ది నేషనల్ అంబేద్కర్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తాలూకా రాజేష్ డిమాండ్ చేశారు.

# ఎస్ఐఆర్‌పై అఖిలపక్ష పోరాటం

## - 8న కొత్తగూడెం జిల్లా కేంద్రంలో మార్చ్‌ఫాస్ట్.. - పూలపెల్లి సుధాకర్‌రెడ్డి..



**బూర్గంపహాడ్ అక్టోబరు 05 (జనంసాక్షి)**
సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈనెల 8న కొత్తగూడెం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అఖిల పక్షాల సంయుక్తంగా నిర్వహించనున్న మార్చ్‌ఫాస్ట్‌ను విజయవంతం చేయాలని బూర్గంపహాడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూలపెల్లి సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులో సోమవారం కాంగ్రెస్ పార్టీతో పాటు సీపీఐ, సీపీఎం, టీడీపీ నాయకులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో నిజమైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించే అవకాశం ఉందంటూ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.
ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన ఓటర్లపై ప్రభావం పడకుండా ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. నిజమైన ఓటర్ల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం ప్రజాస్వామ్య హక్కులకు విఘాతం కలిగిస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని, కేంద్ర ప్రభుత్వ పెద్దలు తమ వైఖరిని మార్చుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఈనెల 8న కొత్తగూడెం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీతో పాటు అఖిలపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించే మార్చ్‌ఫాస్ట్‌లో పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సుధాకర్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి వారాల వేణు, సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, సీపీఐ మండల కార్యదర్శి సబ్కా నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు పేరాల శ్రీనివాసరావు, టీడీపీ అధికార ప్రతినిధి కాకర్ల సత్యనారాయణ, దిశా కమిటీ డైరెక్టర్ బానోత్ మురళీకృష్ణ, అంజనాపురం సర్పంచ్ బానోతు నరసింహ, కృష్ణసాగర్ సర్పంచ్ తాటి వాణి, పినపాక పట్టినగర్ సర్పంచ్ బానోతు పద్మ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బెల్లంకొండ వాసుదేవరావు, యువజన కాంగ్రెస్ నాయకుడు పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కేసుపాక రాజేష్, సీపీఎం కమిటీ సభ్యులు పాపినేని సరోజ, ఆభిధ, రాయల వెంకటేశ్వర్లు, నియోజకవర్గ ఎస్సీ సెల్ ఇన్‌చార్జి కొట్టి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మలేరియా, డెంగ్యూ నియంత్రణ చర్యలను మరింత పటిష్టంగా చేపట్టాలి

## జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. తుకారామ్ రాథోడ్

**భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 5 (జనంసాక్షి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మలేరియా, డెంగ్యూ వ్యాధుల నియంత్రణ, ముందస్తు గుర్తింపు, పరీక్షలు, నివారణ చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. తుకారామ్ రాథోడ్ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. పాల్వంచలోని జిల్లా ఉప వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్లు, సబ్‌యూనిట్ అధికారులు, మలేరియా టెక్నీషియన్లు, సపోర్ట్ సూపర్‌వైజర్లతో జిల్లా స్థాయి రివ్యూ మీటింగ్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ హెల్త్ సెంటర్లలో జరుగుతున్న మలేరియా, డెంగ్యూ టెస్టులు, కేసుల గుర్తింపు, సబ్‌సెంటర్ వారీ పెర్ఫార్మెన్స్, టెస్టింగ్ కిట్ల స్టాక్ తదితర అంశాలను సమీక్షించారు. జిల్లాలో నమోదైన పీవీ (ప్లాస్మోడియం వైవాక్స్), పీఎఫ్ (ప్లాస్మోడియం ఫాల్సిపారం) మలేరియా పాజిటివ్ కేసుల వివరాలను పరిశీలించారు. డెంగ్యూ పాజిటివ్ కేసుల పరిస్థితి, టెస్టులు, సర్వైలెన్స్ చర్యలను సమీక్షించారు. ప్రతి సబ్‌సెంటర్, హెల్త్ సెంటర్ పరిధిలో టెస్టుల నిర్వహణ, కేసుల గుర్తింపు, పురోగతిపై సమీక్ష జరిపారు. అనుమానిత ఫీవర్ కేసులను నిర్లక్ష్యం చేయకుండా ఫీల్డ్ లెవల్‌లో ఆర్‌డీటీ (రాపిడ్ డయాగ్నస్టిక్ టెస్ట్)ల ద్వారా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. సబ్‌సెంటర్ స్థాయిలోనూ అవసరమైన వారికి ఆర్‌డీటీ టెస్టులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి హెల్త్ సెంటర్‌లో మలేరియా, డెంగ్యూ టెస్టింగ్ కిట్ల స్టాక్ పొజిషన్‌ను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అధికంగా కిట్లు ఉన్న కేంద్రాలను గుర్తించి, కిట్లు లేని లేదా తక్కువ స్టాక్ ఉన్న కేంద్రాలకు అదనపు కిట్లను రీడిస్ట్రిబ్యూట్ చేయాలని తెలిపారు. అవసరమైన కేంద్రాలకు టెస్టింగ్ కిట్లను టీ–హబ్ వాహనాల ద్వారా త్వరితగతిన తరలించి, టెస్టింగ్ సేవలకు అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. ఫీల్డ్ సర్వైలెన్స్‌పై ప్రత్యేక



దృష్టిజ్వరంతో బాధపడుతున్న ప్రతి వ్యక్తిని సకాలంలో గుర్తించి అవసరమైన టెస్టులు నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ డా. తుకారామ్ రాథోడ్ సూచించారు. ముఖ్యంగా మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో ఫీవర్ సర్వేలు, ఆర్‌డీటీ టెస్టులు, కేసుల గుర్తింపు, నిర్ధారణ అనంతరం తగిన ట్రీట్‌మెంట్, ఫాలోఅప్ చర్యలను పటిష్టంగా చేపట్టాలని తెలిపారు. ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అన్ని స్థాయిల సిబ్బంది కోఆర్డినేషన్‌తో పనిచేయాలని, మలేరియా, డెంగ్యూ నియంత్రణలో నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతర సర్వైలెన్స్, టెస్టింగ్, ప్రివెంటివ్ యాక్షన్ చేపట్టాలని డీఎంహెచ్‌ఓ ఆదేశించారు. ఈ రివ్యూ మీటింగ్‌లో డా. ఎం. శ్రీధర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, భద్రాచలం, శ్రీ రవి, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్, ల్యాబ్ టెక్నీషియన్లు, సబ్‌యూనిట్ అధికారులు, మలేరియా టెక్నీషియన్లు, సపోర్ట్ సూపర్‌వైజర్లు, సంబంధిత హెల్త్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం

## ○ నిర్ణీత గడువులో సమస్యలు పరిష్కరించాలి
## ○ సబ్‌కలెక్టర్ మృనాల్ శ్రేష్ట

**భద్రాచలం అక్టోబరు 05 (జనంసాక్షి)**
ప్రజావాణిలో అందిన ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని భద్రాచలం సబ్‌కలెక్టర్ మృనాల్ శ్రేష్ట డివిజన్ స్థాయి అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా ప్రజావాణిలో దరఖాస్తుల రూపంలో సమర్పిస్తే వాటిని పరిష్కరించడంతోపాటు అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ, భూ సమస్యలు, పింఛన్లు, సంక్షేమ పథకాలు, నిరుద్యోగ సమస్యలు, వ్యక్తిగత సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించారు. సంబంధిత అధికారులకు అర్జీలను పంపిస్తూ, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి సంబంధిత శాఖలకు పంపించినట్లు తెలిపారు. ప్రతి ఫిర్యాదుపై శాఖాధిపతులు వ్యక్తిగతంగా పర్యవేక్షణ చేపట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, ఎలాంటి అర్జీ పెండింగ్‌లో ఉండకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో సుధీర్, డీఏవో భగవాన్‌రెడ్డితో పాటు భద్రాచలం డివిజన్ పరిధిలోని వివిధ శాఖల డివిజనల్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.



# ప్రజావాణి వినతులకు సత్వర పరిష్కారం చూపాలి : కలెక్టర్ అంకిత్

రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాలు, ఉపాధి, పింఛన్లు, గృహాలు, మౌలిక వసతులు, సామాజిక భద్రత తదితర సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం ముఖ్యమైన వేదికగా నిలుస్తోందన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావివ్వరాదని స్పష్టం చేశారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఎలాంటి ఆలస్యం లేకుండా పరిష్కరించాలని, క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంతో పాటు మండల స్థాయిలోని ఎంపీడీవో కార్యాలయాల్లో కూడా ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమకు సమీపంలోని ఎంపీడీవో కార్యాలయంలో వినతులు సమర్పించి, స్థానిక స్థాయిలోనే సమస్యలకు పరిష్కారం పొందాలని సూచించారు. వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు.

**ప్రజావాణిలో వచ్చిన కొన్ని వినతులు.**
గుండాల మండలం కాంచనపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని జగ్గు తండాకు చెందిన బానోత్ చాందిని తన భూమికి సంబంధించిన సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సర్వే నంబర్ 31, ఖాతా నంబర్ 33లో ఉన్న భూమిని గతంలో సర్వేయర్ ద్వారా సర్వే చేయించి, చుట్టుపక్కల రైతుల సంతకాలు కూడా తీసుకున్నప్పటికీ ఇప్పటివరకు పట్టా మంజూరు కాలేదని తెలిపారు. తనకు పట్టా మంజూరు చేయించి న్యాయం చేయాలని కోరారు. ఈ దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల నిమిత్తం తాసిల్దార్ కు ఎండార్స్ చేశారు.
లక్ష్మీదేవిపల్లి మండలం పాత కారుకొండ గదిగుట్ట గ్రామపంచాయతీ పరిధికి చెందిన బట్టు సుభద్ర తనకు స్థానికతకు సంబంధించిన లోకల్ ఏరియా సర్టిఫికెట్‌ను సంబంధిత తహసీల్దార్ మంజూరు చేశారని తెలిపారు. ఇటీవల అంగన్‌వాడీ ఆయా పోస్టుకు దరఖాస్తు చేసుకోగా, విచారణ సమయంలో తాను స్థానికంగా ఉండడం లేదని, హైదరాబాద్‌లో నివసిస్తున్నట్లు గుర్తుతెలియని వ్యక్తులు అధికారులకు సమాచారం ఇచ్చారని తెలిపారు . ఈ విషయంపై సంబంధిత తహసీల్దార్ ద్వారా విచారణ జరిపించి తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరగా, కలెక్టర్ తగు చర్యలు నిమిత్తం గుండాల తాసిల్దార్ కు ఎండార్స్ చేశారు. దుమ్ముగూడెం మండలానికి చెందిన బానోత్ భవిత గత ఆరు సంవత్సరాలుగా పర్ణశాలలోని నారచీరల ప్రాంతంలో కూల్‌డ్రింక్స్, బజ్జి, పకోడీల దుకాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత నెలలో గోదావరి వరదల సమయంలో తన దుకాణం నీట మునిగిపోవడంతో దుకాణాన్ని తొలగించానని, తిరిగి అదే ప్రాంతంలో దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు వెళ్లగా మరొకరు అక్కడ దుకాణం ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని, తన దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించి న్యాయం చెయ్యాలని చేసిన దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యలు నిమిత్తం దుమ్ముగూడెం తాసిల్దార్ కు ఎండార్స్ చేశారు. దమ్మపేట మండలం వడ్లగూడ గ్రామపంచాయతీకి చెందిన కుంజ సావిత్రి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన పట్టాదారు పాస్‌బుక్‌లలో సర్వే నంబర్ 394/10/ంలో 4.2500 ఎకరాల భూమి ఉన్నట్లు తెలిపారు. సదరు భూమికి తెలంగాణ పట్టాదారు పాస్‌బుక్ జారీ చేయడంతో పాటు భూమి హద్దులను సర్వే చేయాలని కోరుతూ చేసిన దరఖాస్తు ను పరిశీలించి తగు చర్యలు నిమిత్తం దమ్మపేట తాసిల్దార్ కు ఎండార్స్ చేశారు.
లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ పంచాయతీకి చెందిన వాంకుండోత్ సునీత మాట్లాడుతూ, తన కుమారుడు చరిత్ మానస్ తమిళనాడు రాష్ట్రంలోని అమరావతి నగర్‌లో ఉన్న ఆల్ ఇండియా సైనిక్ స్కూల్‌లో చదువుతున్నట్లు తెలిపారు. తెలంగాణలో సైనిక్ స్కూల్ అందుబాటులో లేనందున ఎన్‌టీఏ నిర్వహించిన పరీక్షలో తెలంగాణ రాష్ట్రం నుంచి ఎస్టీ కేటగిరీలో మొదటి ర్యాంక్ సాధించి తమిళనాడులోని సైనిక్ స్కూల్‌లో సీటు పొందినట్లు పేర్కొన్నారు. ప్రతి ఏడాది సుమారు రూ.2 లక్షల మేర ఫీజు చెల్లించాల్సి రావడంతో ఆర్థికంగా భారంగా మారిందని తెలిపారు. తన భర్త 2020లో ప్రమాదవశాత్తు మృతి చెందారని, తన కుమారుడి చదువుకు ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



# సేవలకు సెల్యూట్..

## దామోదర్‌బాబుకు ఘన వీడ్కోలు

**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 5 (జనంసాక్షి)**
అన్నపురెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా సుదీర్ఘకాలం పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించిన బి. దామోదర్‌బాబు బదిలీపై ఖమ్మం జిల్లా కేంద్రానికి వెళుండటంతో తోటి పోలీస్ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. సోమవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఎస్సై విజయ్ సింహారెడ్డి దామోదర్‌బాబును శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. దామోదర్‌బాబు తన సేవా కాలంలో ఎలాంటి వివాదాలకు తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించారని కొనియాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఆయన చూపిన చొరవ, తోటి సిబ్బందితో మమేకమైన తీరు స్ఫూర్తిదాయకమన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో చేపట్టబోయే నూతన విధుల్లోనూ దామోదర్ బాబు మరింత విజయవంతంగా రాణించాలని ఆకాంక్షించారు. ఆయనకు కుటుంబ సమేతంగా మంచి ఆరోగ్యం, సుఖసంతోషాలు, ఉజ్వల భవిష్యత్తు కలగాలని ఎస్సై విజయ్ సింహారెడ్డి కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొని దామోదర్‌బాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

## రోడ్లపై మూగజీవాలకు 'విక్రమార్కుడి' అండ!

- రామయ్య చెంత నిరాశ్రయ గోవులకు కొత్త గూడు..
- గోశాల ఏర్పాటుకు వ్యాపారవేత్త విక్రమ్ సంకల్పం..



**భద్రాచలం అక్టోబరు 05 (జనంసాక్షి):** ఆకలితో అలమటిస్తూ.. రక్షణ లేక రోడ్లపై తిరుగుతూ.. వాహనాల ఢీకొనడంతో గాయాలపాలై నరక యాతన అనుభవిస్తున్న మూగజీవాలకు ఇకపై ఓ అండ దొరకనుంది. రామయ్య కొలువైన భద్రాచలం పుణ్యక్షేత్రంలో నిరాశ్రయ గోవులు, ఇతర మూగజీవులకు శాశ్వత రక్షణ కల్పించేందుకు వ్యాపారవేత్త, విక్రమ్ సూపర్ మార్కెట్ అధినేత విక్రమ్ ముందడుగు వేశారు. రోడ్లపై వాహనాల కింద పడి గోవులు, ఇతర మూగజీవాలు ప్రాణాలు కోల్పోతున్న హృదయ విదారక ఘటనలు తనను కలచివేశాయని విక్రమ్ తెలిపారు. గాయపడిన జీవాలకు చికిత్స అందించడంతో పాటు వాటికి ఆహారం, నీడ, రక్షణ కల్పించేందుకు భద్రాచలంలో ప్రత్యేకంగా గోశాల ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ సంకల్పానికి సంబంధించి పట్టణంలోని జంతు ప్రేమికులతో కలిసి ఆయన సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రమ్ మాట్లాడుతూ రోడ్లపై తిరుగుతున్న అనేక గోవులు వాహనాల ఢీకొనడంతో గాయపడుతున్నాయని, కొన్ని ప్రాణాలు కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. క్షతగాత్రులైన మూగజీవాలు రోడ్ల పక్కన ఆర్తనాదాలు చేస్తున్న దృశ్యాలను చూస్తూ ఇక మౌనంగా ఉండలేకపోతున్నామని అన్నారు. "మూగజీవాలకు నీడ, ఆహారం, వైద్యసేవలు అందేలా ప్రత్యేక గోశాలను ఏర్పాటు చేయాలని సంకల్పించాం. ఇది ఒక్కరి వల్ల సాధ్యమయ్యే కార్యక్రమం కాదు. పట్టణ ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారులు, ప్రజలు, జంతు ప్రేమికులు కలిసి ముందుకు రావాలి" అని విక్రమ్ పిలుపునిచ్చారు. మూగజీవుల పట్ల చూపే కారుణ్యమే నిజమైన భక్తికి ప్రతీక అని పేర్కొన్న ఆయన.. పట్టణవాసుల సహకారంతో త్వరలోనే గోశాల నిర్మాణాన్ని పూర్తి చేసి రోడ్లపై సంచరించే నిరాశ్రయ జీవాలకు రక్షణ కల్పిస్తామని తెలిపారు. మూగజీవాలకు భరోసాగా నిలిచేలా విక్రమ్ చేపట్టిన ఈ కార్యక్రమంపై పట్టణ ప్రజలు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమావేశంలో సాగర్, శర్మ, లావణ్య పాల్గొన్నారు.

# భద్రాచలం పట్టణ సీఐగా నట్ల రాజు..!

- వారంరోజుల ఉత్కంఠకు తెర.. బాధ్యతలు స్వీకరణ..
- అక్రమ ఇసుక, గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాల్సిన సవాల్..

**భద్రాచలం అక్టోబరు 05 (జనంసాక్షి)**





భద్రాచలం పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నియామకంపై వారం రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. భద్రాచలం పట్టణ సీఐగా నట్ల రాజును నియమిస్తూ సోమవారం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన భద్రాచలం పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల భద్రాచలం పట్టణ సీఐగా పనిచేసిన మేడిపల్లి నాగరాజు ఖమ్మంకు బదిలీ కావడంతో కొత్త సీఐ ఎవరనే అంశంపై పోలీసు వర్గాల్లో ఆసక్తి నెలకొంది. వారం రోజులుగా పలువురి పేర్లను పరిశీలించిన అధికారులు చివరకు నట్ల రాజును ఎంపిక చేశారు. నట్ల రాజు గతంలో అశ్వాపురం సీఐగా విధులు నిర్వహించారు. అక్కడి నుంచి బదిలీపై భద్రాచలం పట్టణానికి వచ్చి బాధ్యతలు చేపట్టారు. కొత్త సీఐ ముందున్న ప్రధాన సవాళ్లలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడి ఉన్నాయి. ప్రత్యేకంగా పట్టణంలో అక్రమ ఇసుక రవాణా, గంజాయి అక్రమ రవాణా విక్రయాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. నేరాల నియంత్రణతో పాటు ప్రజలకు పోలీసు శాఖ మరింత చేరువయ్యేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కొత్త సీఐ నట్ల రాజు ఆధ్వర్యంలో భద్రాచలం పట్టణ పోలీసింగ్ ఏ దిశగా సాగుతుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.



# పోయిన 32 మొబైల్ ఫోన్లు రికవరీ

### సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి బాధితులకు అప్పగించిన భద్రాచలం పోలీసులు

**భద్రాచలం అక్టోబరు 05 (జనంసాక్షి)**
పలు సందర్భాల్లో పోయిన మొబైల్ ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గుర్తించి భద్రాచలం టౌన్ పోలీసులు బాధితులకు అప్పగించారు. భద్రాచలం టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మొబైల్ ఫోన్లు పోయినట్లు అందిన ఫిర్యాదుల మేరకు వాటి వివరాలను కేంద్ర పరికర గుర్తింపు నమోదు పోర్టల్‌లో నమోదు చేశారు. ఈ ప్రక్రియలో సాంకేతిక ఆధారాలతో 32 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి, సోమవారం భద్రాచలం డీఎస్పీ యం. అరుణ్ కుమార్ సంబంధిత బాధితులు, యజమానులకు వాటిని అప్పగించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రద్దీ ప్రాంతాలు, మార్కెట్లు, బస్సులు, రైల్వే స్టేషన్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో మొబైల్ ఫోన్లు వినియోగించే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫోన్లను నిర్లక్ష్యంగా ఎక్కడపడితే అక్కడ ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మొబైల్ ఫోన్ పోయినా లేదా చోరీకి గురైనా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, ఫోన్‌కు సంబంధించిన ఐఎంఈఐ నంబర్‌తో పాటు ఇతర వివరాలను పోలీసులకు అందించాలని డీఎస్పీ సూచించారు.

# మూడు నెలలుగా వేతనాల్లేవు.. ఖాళీ కడుపుతో పారిశుద్ధ్య పనులెలా?

- ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కార్మికుల మెరుపు నిరసన..
- పెండింగ్ వేతనాలు చెల్లిస్తామని సూపరింటెండెంట్ హామీ..

**భద్రాచలం అక్టోబరు 05 (జనంసాక్షి)**
మూడు నెలలుగా వేతనాలు అందక తాము, తమ కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆరోపిస్తూ భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి పారిశుద్ధ్య కార్మికులు, భద్రతా సిబ్బంది, ఇతర తాత్కాలిక ఉద్యోగులు సోమవారం మెరుపు నిరసన చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆసుపత్రి ప్రధాన గేటు వద్ద ధర్నా నిర్వహించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ మాట్లాడుతూ.. వేతనాలు లేకుండా ఖాళీ కడుపుతో పారిశుద్ధ్య పనులు ఎలా చేయగలరని ప్రశ్నించారు. ఆసుపత్రి పారిశుద్ధ్య పనుల గుత్తేదారు గత ఏడాది కాలంగా కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కనీస వేతనం రూ.18,500 చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.11 వేలే ఇస్తున్నారని, ఆ మొత్తాన్ని కూడా నెలల తరబడి ఆలస్యం చేస్తున్నారని తెలిపారు. గతంలోనూ వేతనాల సమస్య తలెత్తడంతో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, డీసీహెచ్ రవీంద్రనాయక్



దృష్టికి తీసుకెళ్లినా సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదన్నారు. నాలుగు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రోజూ సుమారు 500 నుంచి 800 మంది వరకు రోగులు ఓపీకి వస్తున్నారని తెలిపారు. తగినంత పారిశుద్ధ్య సిబ్బంది లేకపోవడంతో ఉన్న కార్మికులపై అదనపు పని భారం పడుతోందన్నారు. కార్మికుల వేతనాలను నేరుగా వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం కార్మిక నాయకులు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డితో చర్చలు జరిపారు. వారం రోజుల్లోగా పెండింగ్ వేతనాలు చెల్లించి సమస్యను పరిష్కరిస్తామని సూపరింటెండెంట్ హామీ ఇవ్వడంతో కార్మికులు నిరసన విరమించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ బండారు శరత్‌బాబు, పారిశుద్ధ్య కార్మికుల సంఘం నాయకులు ఎం.రమ, నరేందర్, నాగరాజు, కృష్ణ, శోభ తదితరులు పాల్గొన్నారు.

# 25 ఏళ్లుగా చీకట్లోనే చింతకుంట!

- రోడ్డు, విద్యుత్, అంగన్‌వాడీ కోసం గిరిజనుల ఎదురుచూపులు.
- అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్థుల ఆవేదన.. సీపీఐ ఆందోళన హెచ్చరిక

**బూర్గంపహాడ్ అక్టోబరు 05 (జనంసాక్షి)**
స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా.. గిరిజన గ్రామానికి మాత్రం అభివృద్ధి జాడ కనిపించడం లేదు. 25 ఏళ్లుగా సుమారు 40 కుటుంబాలు నివసిస్తున్నప్పటికీ కనీస మౌలిక వసతులకు నోచుకోక చింతకుంట గ్రామం చీకట్లోనే మగ్గుతోంది. రోడ్డు, విద్యుత్ సౌకర్యాలు లేక నిత్య ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం మోత గ్రామపంచాయతీ శివారు చింతకుంటలో విద్యుత్ సౌకర్యం లేక సాయంత్రం ఆరు గంటలు దాటితే చీకట్లోనే జీవనం సాగించాల్సి వస్తోందని గ్రామస్థులు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు రావాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. ఏడు కిలోమీటర్లు నడిచి బడికి.. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, విద్యా సౌకర్యాలు లేక చిన్నారులు చదువుకోవాలంటే సుమారు ఏడు కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాలు, వరదల సమయంలో ఈ కష్టాలు మరింత తీవ్రమవుతున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

**ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం శూన్యం**

గ్రామ సమస్యలను పరిష్కరించాలని ప్రజాదర్బార్, ఐటీడీఏ, ఎంపీడీవో, కలెక్టర్ కార్యాలయాల్లో పలుమార్లు దరఖాస్తులు సమర్పించినా ఇప్పటివరకు పరిష్కారం లభించలేదని గ్రామస్థులు తెలిపారు. తమ సమస్యలపై అధికారులు ఇకనైనా ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. చింతకుంట గ్రామాన్ని సందర్శించిన సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి సభ్యులు పేరాల శ్రీనివాసరావు గ్రామస్థులతో మాట్లాడి



సమస్యలను తెలుసుకున్నారు. 25 ఏళ్లుగా గ్రామానికి రోడ్డు, విద్యుత్, అంగన్‌వాడీ వంటి కనీస సౌకర్యాలు లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఐటీడీఏ పీఓ, జిల్లా కలెక్టర్, మండల అధికారులు తక్షణమే స్పందించి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే సీపీఐ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పేరాల శ్రీనివాసరావు హెచ్చరించారు.

# శ్రీ వెంకటేశ్వర దేవాలయ నిర్మాణానికి కొత్తగూడెం పేరు పెట్టండి

## అదనపు కలెక్టర్ పి.శ్రీజకు వినతి



**ఖమ్మం కార్పొరేషన్ ,అక్టోబర్ 05 (జనంసాక్షి)** కొత్తగూడెం రెవెన్యూ పరిధిలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం, కళ్యాణ మండపం మరియు ఇతర నిర్మాణాలకు సంబంధించిన శిలాఫలకాలపై కొత్తగూడెం పేరు పెట్టాలని ఖమ్మం నగరంలోని కొత్తగూడెం ప్రాంతానికి చెందిన 14వ మరియు 15వ డివిజన్ల అఖిలపక్ష నేతలు. పగడాల మల్లేష్, యర్ర బోయిన గోవిందరావు, చేతుల నాగేశ్వర రావు, మొర్రిమేకల కోటయ్య, రావుల హనుమంతరావు, డిమాండ్ చేస్తూ ఈరోజు ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ టి. శ్రీజకు వినతి పత్రం అందజేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. కొత్త గూడెం రెవెన్యూపరిధిలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయం, కళ్యాణ మండపం తదితర నిర్మాణాలు చేపడుతున్న విషయం విదితమే. అయితే, ఈ నిర్మాణాలకుసంబంధించి పత్రికా మరియు ఇతర ప్రచార మాధ్యమాలలో ఈ ప్రాంతాన్ని అల్లీపురం పేరుతో పెర్కొనడం స్థానిక ప్రజల దృష్టికి వచ్చిందని తెలిపారు. వాస్తవానికి, దేవాలయ నిర్మాణం జరుగుతున్న స్థలం, పి.బి. నగర్ ప్రాంతం మరియు సంబంధిత భూములు, సర్వే నంబర్లు అన్నీ కొత్తగూడెం రెవెన్యూ పరిది లోనే ఉన్నాయన్నారు. అటువంటప్పుడు, కొత్తగూడెం ప్రాంతంలో నిర్మిస్తున్న ఇంతటి ప్రతిష్టాత్మకమైన ఆధ్యాత్మిక కట్టడాలకు అల్లీపురం పేరును మాత్రమే ప్రస్తావించడం వల్ల స్థానిక ప్రజలలో కొంత అసంతృప్తి నెలకొంటోంది ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కొత్తగూడెం ప్రాంత ప్రజల మనోభావాలకు సంబంధించిన అంశంగా మారిందని ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలను మరియు వాస్తవ రెవెన్యూ పరిధిని పరిగణనలోకితీసుకొని, టీటీడీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం, కళ్యాణ మండపంమరియు ఇతర నిర్మాణాలకు సంబంధించిన శిలాఫలకాలు, ప్రారంభోత్సవ ఫలకాలు, అధికారికరికార్డులు, ప్రచార ప్రకటనలు మరియు ఇతరత్రా అన్ని సందర్భాలలో 'కొత్తగూడెం' లేదా'కొత్తగూడెం- అల్లిపురం రోడ్డు' అనే పేరును స్పష్టంగా పొందుపరచాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై కొత్తగూడెం ప్రాంత ప్రజలు అఖిలపక్ష నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక పెద్దల సమక్షంలో చర్చించి, ఏకాభిప్రాయంతో తీర్మానం చేయడం జరిగిందని గౌరవ మంత్రి వర్యులు ఈ విషయాన్ని ప్రత్యేకంగా పరిశీలించి, సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసి,కొత్తగూడెం ప్రాంత ప్రజల మనోభావాలను గౌరవించే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం అఖిల పక్ష నాయకులు మాకెనబోయిన నాగేశ్వరరావు, పల్లెబోయిన పుల్లారావు, బొమ్మిశెట్టి లక్ష్మినర్సయ్య, పొదిల ఉపెందర్, యర్రబోయిన వెంకటయ్య, నాగటి శేషయ్య, పర్వత సైదులు, పొదిల రామారావు, బొమ్మిశెట్టి భాస్కర్, చామకూరి శంఖర్, చిర్ర శంఖర్, పడగాల వెంకటేశ్వర్లు, దంతాల నాగరాజు, షేక్.మీరా, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, లింగనబోయిన దాసు, బండ్ల వెంకటేశ్వర్లు, కర్రి కృష్ణ,మొర్రిమేకల వెంకటనారాయణ, అమరయ్య, చిగంటి శ్రీను, పగడాల అనంతరాములు, తదితరులు పాల్గొన్నారు.

# దొంగతోగు గిరిజన గ్రామానికి

# రోడ్డు పర్మిషన్ వెంటనే మంజూరు చేయాలి

### సీపీఐ (ఎం-ఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో కి వినతి పత్రం అందజేత



**ఆళ్లపల్లి అక్టోబర్ 5(జనం సాక్షి)** మండలం కేంద్రం లోని దొంగతోగు గ్రామ పంచాయతీకి నడిమిగూడెం నుండి ఆర్&బి రోడ్డు సుమారు 6 కిలోమీటర్ల పర్మిషన్ మంజూరు చేసి వెంటనే నిర్మించాలని ఎంపీడీవోకి వినతి పత్రం,అందజేత. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ నాయకులు ఈ ఈసం శంకరన్న,కొమరం. శాంతన్న,మాట్లాడుతూ. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లయినా దొంగతోగు గ్రామ పంచాయతీకి ఇప్పటివరకు రోడ్డు సౌకర్యం కల్పించకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనం ఘాటుగా విమర్శించారు వర్షాకాలంలో ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని పరిస్థితి ఉందని,గర్భిణీ స్త్రీలను, రోగులను ఆసుపత్రికి తీసుకెళ్లాలంటే డోలీ మోయాల్సిన దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల చదువులు,రైతుల పంటల రవాణా పూర్తిగా. స్తంభించిపోతోందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 6 కి.మీ ఫార్మేషన్ రోడ్డును మంజూరు చేయాలని గ్రామంలో కరెంటు పోల్స్ వేయించి రైతులకు ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు ప్రజావాణిలో ఎంపీడీవో దొంగతోగు గ్రామ సమస్యలను వినతి పత్రిక రూపంలో అందించడం జరిగిందని ఆలపల్లి మండల ఎంపీడీవో ధరావత్ శ్రీను స్పందించి ఫోన్లోఆర్ అండ్ బి అధికారులతో కరెంటు సబ్ ఇంజనీర్ తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం-ఎల్) మాస్ లైన్ పార్టీ నాయకులు,గొగ్గల వెంకటేశ్వర్లు,ఈసం సమ్మయ్య,పూణేం మంగయ్య,ఈసం యనయ్య,చీమల నారాయణ,ఈసం నారాయణ,బచ్చల రమేష్,ఈసం శ్రీకాంత్, దొంగతోగు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రాజకీయాలను దిగజారుస్తున్న బజారు భాష

- సమస్యల మళ్లింపుకే ఆస్తుల ఆరోపణలు
- ఐజెయు మీట్ ద ప్రెస్లో సిపిఎం నేత తమ్మినేని




**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 5 (జనంసాక్షి )** రాష్ట్రంలో అధికార, విపక్ష నేతలు వాడుతున్న బజారు భాష రాష్ట్ర రాజకీయాలను దిగజారుస్తుందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంపి తమ్మినేని వీరభద్రం తెలిపారు. గౌరవనీయ భాష ప్రయోగించకుండా నీచ పదజాలం రాజకీయాల్లో సరైంది కాదని ఆయన తెలిపారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించుకే భూ కబ్జాలు, ఆక్రమణల వ్యవహారాన్ని తెరపైకి తెస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. సోమవారం టియుడబ్ల్యూజె (ఐజేయు) ఆధ్వర్యంలో తమ్మినేనితో మీట్ ద ప్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ సమన్వయ కర్తగా వ్యవహరించగా టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు అధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో తమ్మినేని మాట్లాడుతూ నేతల భాష ఆక్షేపణీయమని ఈ భాష సరైంది కాదన్నారు. విమర్శించడానికి ఈ పద్ధతి తగదని ఆయన కాంగ్రెస్, బిఆర్ఎస్లకు సూచించారు. రాష్ట్రంలో రెండు పార్టీల మధ్య భూ ఆక్రమణలు, అక్రమ సంపాదనలకు సంబంధించి పరస్పర విమర్శల పర్వం సాగుతుందని కేవలం ప్రజా సమస్యలను పక్కదారి పట్టించడానికే పథకం ప్రకారం రెండు పార్టీలు వ్యవహరిస్తున్నాయని ఆయన ఆరోపించారు. పాపాలు చేయడంలో రెండు పార్టీలు సమానమేనని రేవంత్రెడ్డి కుటుంబ సభ్యుల భూ వ్యవహారాలకు సంబంధించి బిఆర్ఎస్ కేవలం ఆరోపణలకే పరిమితం అవుతుండగా అధికారం చేతిలో ఉన్న కాంగ్రెస్ కూడా కేవలం ఆరోపణలు మాత్రమే చేస్తుందని ఈ వ్యవహారం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. కాంగ్రెస్ భూ ఆక్రమణలపై బిఆర్ఎస్ కార్యాచరణ చేపట్టదని బిఆర్ఎస్ భూ ఆక్రమణలపై అధికార పార్టీ చర్యలకు పూనుకోదని ఈ విషయం ప్రజలకు కూడా తెలుసునన్నారు. అధికారం చేతిలో ఉన్నప్పుడు భూములు పంచేందుకు జంకేందుకని తమ్మినేని ప్రశ్నించారు. హామీలు అమలు పరచలేని కాంగ్రెస్ వల్ల కార్యాచరణ లేని బిఆర్ఎస్ వల్ల ఈ రాష్ట్ర ప్రజలకు ఒరిగింది ఏమి లేదన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే భారతదేశంలో ప్రజల పాత్ర క్రమేపి తగ్గిపోతుందన్నారు. ఒకప్పుడు రిగ్గింగులు, ఓట్ల కొనుగోలు, ఇప్పుడు గెలిచిన అభ్యర్థులను కొనుగోలు చేయడం ఏకంగా ఓటింగ్ మిషన్ల ద్వారా ఓట్లను సానుకూలంగా వేయించుకునే పద్దతికి తెరలేపారన్నారు. ఎన్నికల ఫలితాలను ప్రజల అభిప్రాయాలకు భిన్నంగా తీసుకు వచ్చే ప్రయత్నంలో బిజెపి 2024లోనే సఫలీకృతమైనట్లు అనేక సర్వేలు చెబుతున్నాయన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం పాలన సాగడం లేదని ప్రజల విమర్శకు కనీసం సమాధానం చెప్పే స్థితిలో కేంద్ర ప్రభుత్వం లేదన్నారు. ఎవరైనా విమర్శిస్తే దేశ ద్రోహులుగా ముద్రిస్తున్నారని తమ్మినేని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ ఎంపికే తప్పని పద్ధతి ప్రకారం జరగని ఎన్నికల కమిషన్ ఎంపికతో అధికారానికి ఎన్నికల కమిషనర్ దాసోహం అన్నారని ఆయన తప్పనిసరిగా రాజీనామా చేయాల్సిందేనని తమ్మినేని స్పష్టం చేశారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తులు పెత్తనం చేసే ప్రయత్నం చేస్తున్నాయని ఆ క్రమంలోనే దిమాగినక్సల్స్ పదాన్ని తెరపైకి తెచ్చారన్నారు. నక్సల్స్ పేరుతో అడవుల్లోని సాయుధులను హతమార్చినట్లు ఆలోచించగలిగి సమాజం కోసం పనిచేసే వారిని దిమాగి నక్సల్స్ పేరుతో హతమారుస్తారా అని తమ్మినేని ప్రశ్నించారు. బిజెపి గ్రాఫ్ పడిపోతుందని 2014లో సంక్షేమం, ఆర్థిక ప్రణాళికతో ముందుకు వచ్చిన బిజెపి 2024 నాటికి మతాన్ని ఎజెండాగా చేసిందని బిజెపి కేవలం టిడిపి, ఇతర మిత్ర పక్షాల మద్దతుతోనే అధికారంలోకి రాగలిగిందన్నారు. అమెరికాకు మోడీ దాసోహం అంటుండగా అమెరికాలో తీవ్ర ఆర్థిక సంక్షోభం నెలకొందని అక్కడి ప్రజలు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల పట్ల నిరసన వ్యక్తం చేస్తున్నారని తమ్మినేని తెలిపారు. భారతదేశంలో అవినీతి వ్యవస్థీకృతమవుతుందని ఆయన తెలిపారు. వ్యవస్థీకృతమైన అవినీతి పేద, సామాన్య ప్రజలకు తీవ్ర నష్టాన్ని, కష్టాలను తెచ్చిపెడుతుందన్నారు. జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం సమస్యలను పక్కదారి పట్టించేందుకే విపక్షంపై ఆరోపణలు చేసి రాద్దాంతం చేస్తుందని చివరకు ఏమి తేల్చలేని స్థితికి దిగజారుతుందన్నారు. ఏ ఒక్క హామీని నెరవేర్చే స్థితిలో ఈ ప్రభుత్వం లేదన్నారు. బిఆర్ఎస్ కూడా ప్రకటనలకే పరిమితం అవుతుంది తప్ప కార్యాచరణ ప్రకటించడం లేదన్నారు. రాష్ట్రంలో మూడో ఫ్రంట్కు అవకాశం లేదని తమ్మినేని తెలిపారు. కమ్యూనిస్టుల సమీకరణ శక్తి తగ్గుతుందన్న ప్రశ్నకు తమ్మినేని సమాధానం ఇస్తూ సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవహారాల్లో వచ్చిన మార్పులు కొంత కారణమని కానీ ప్రజల సమస్యలపై నిరంతర ఆందోళనలు చేస్తూనే ఉన్నామన్నారు. ఎన్నికల ఫలితాలపై తమ్మినేని మాట్లాడుతూ బలమైన ఎజెండాతో ఎన్నికల్లోకి వెళ్తున్న బూర్జువా పార్టీల ఆర్థిక, వ్యవహారాలు ఎన్నికల సంఘం వ్యవహార శైలితో ఆశించిన ఫలితాలను రాబట్టలేకపోతున్నామన్నారు. కాంగ్రెస్తో 2024లో పొత్తు చెడిపోవడానికి పాలేరు కారణం కాదని తమ్మినేని స్పష్టం చేశారు. రెండు పార్టీల మధ్య సరైన అవగాహన లేదని కాంగ్రెస్ పార్టీ ఏకపక్షంగా వ్యవహరించిందన్నారు. ప్రజలను కదిలించడం ద్వారా ప్రజా ఉద్యమ నిర్మాణానికి సిపిఎం ప్రాధాన్యతనిస్తుందన్నారు. వామపక్షాల ఐక్యత గురించి అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ ఐక్య కార్యాచరణ లేకుండా ఐక్యత సాధ్యం కాదని సిపిఐ, సిపిఎంల మధ్య పార్టీ కార్యక్రమంలోనే తేడా ఉందని దాని సరిచేసుకుంటేనే ఐక్యత సాధ్యమవుతుందన్నారు. విలీనానికి సిపిఎం వ్యతిరేకం కాదని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికార కాంక్షతో వ్యవహరిస్తుందని ఇండియా కూటమిలో ఉన్న పార్టీలను సైతం ఓడించేందుకు ప్రయత్నిస్తుందని అదే విషయం కేరళలో స్పష్టమైందన్నారు. జన్జ ఉద్యమం అంతకు ముందు రైతు ఉద్యమం ఈ దేశంలో ఇటీవల కాలంలో అపూర్వ విజయాలు సాధించాయని రైతు ఉద్యమం నల్ల చట్టాలను రద్దు చేయించగలిగితే జనీ ధర్మేంద్ర ప్రధాన న్ను రాజీనామా చేయించిందని ఇప్పుడు ఎన్నికల కమిషనర్ కూడా రాజీనామా చేయాలని లేని పక్షంలో జన్జీతో పాటు వామపక్షాలు, కలిసి వచ్చే శక్తులను కలుపుకుని ఉద్యమిస్తాయన్నారు. జనీ డిమాండ్లు కమ్యూనిస్టుల డిమాండ్లనని ఆయన తెలిపారు. సిపిఎం నాయకుని హత్యకు సంబంధించి ఉప ముఖ్యమంత్రి నియోజక వర్గంలో జరిగినప్పుడు ఎవరు హత్య చేశారో తేల్చాల్సిన బాధ్యత ఆయనకే ఉందని హంతకులను అరెస్టు చేయండి అంటూ ఇప్పటికే సిపిఎం పలు ఆందోళనలు చేపట్టిందని ఒక ప్రశ్నకు సమాధానంగా తమ్మినేని తెలిపారు. ఒకరిద్దరు వ్యక్తుల వ్యక్తిగత వ్యవహారశైలి కారణంగానే ఏదులాపురం మున్సిపాలిటీలో ఒక స్థానం ఏకగ్రీవమైందని అది పార్టీ నిర్ణయం కాదన్నారు. ఖమ్మం జర్నలిస్టులు తమ్మినేనిని శాలువతో సత్కరించారు.

# దృశ్య కళా మాంత్రికుడు షేక్ నాగుల్ మీరా

**జాతీయ స్థాయి 'భారత్ కళా పురస్కార్-2026'**

**లెన్స్ వెనుక దాగిన సృజనాత్మక ప్రతిభకు దక్కిన అత్యున్నత గౌరవం**

**వివాహ ఫొటోగ్రఫీ రంగంలో ఖమ్మం యువ కెరటం సరికొత్త రికార్డు**

**ఖమ్మం, (జనంసాక్షి) :** క్షణిక కాలంలో జారిపోయే భావోద్వేగాలను శాశ్వత కావ్యాలుగా మలచడంలో ఫొటోగ్రాఫర్ షేక్ నాగుల్ మీరాది తిరుగులేని ప్రతిభ. ఖమ్మం నగరానికి చెందిన నాగుల్ మీరా ఈ విశిష్ట ఫొటోగ్రాఫర్, తన కెమెరా కంటితో వివాహ ఫొటోగ్రఫీ రంగానికే సరికొత్త వన్నె తెచ్చారు. ఫొటోగ్రఫీని కేవలం వృత్తిగా చూడకుండా, అణువణువునా కళగా శ్వాసిస్తూ ఆయన వేసిన ప్రతి ఫ్రేమ్ ఒక అపురూప కళాఖండంగా నిలిచింది. పెళ్లిపీటలపై వధూవరుల కనుచూపుల్లో మెరిసే మురిపెం మొదలుకొని, వేడుకల్లోని అనురాగ బంధాల వరకు ప్రతి సున్నితమైన క్షణాన్ని తన సృజనాత్మక దృష్టితో బంధించి అందరినీ మంత్రముగ్ధులను చేశారు. షేక్ నాగుల్ మీరా అసాధారణ ప్రతిభ, కళా నైపుణ్యాలను గుర్తించిన వందే భారత్, పీపుల్స్ పంచాయత్ నెట్వర్క్ సంస్థలు ప్రతిష్టాత్మక 'భారత్ కళా పురస్కార్?2026' అవార్డుతో ఆయనను సత్కరించాయి. జాతీయ స్థాయిలో తీవ్ర పోటీ నెలకొన్న వేదికపై ఆయనను 'బెస్ట్ వెడ్డింగ్ ఫొటోగ్రాఫర్'గా ఎంపిక చేసి సముచిత గౌరవం అందించాయి. లెన్స్ వెనుక నిలిచి ప్రపంచానికి అందాన్ని పంచే ఒక నిజమైన కళాకారుడికి దక్కిన ఘనమైన గుర్తింపు ఇది. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్ నాగుల్ మీరా మాట్లాడుతూ.. తన ప్రతిభను, కళను గుర్తించి




జాతీయ స్థాయిలో ఈ పురస్కారం అందించడం కెరీర్లో మర్చిపోలేని మధుర ఘట్టమని పేర్కొన్నారు. ఈ గౌరవం తనపై బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో నవ్య శైలితో మరిన్ని సృజనాత్మక సేవలు అందిస్తానని స్పష్టం చేశారు. ఖమ్మం గడ్డ గర్వించదగ్గ రీతిలో జాతీయ వేదికపై వెలిగిన నాగుల్ మీరా ప్రతిభను పలువురు సీనియర్ ఫొటోగ్రాఫర్లు, ప్రముఖులు, మిత్రులు కొనియాడుతూ ప్రశంసల జల్లు కురిపించారు.

## పాడుగోడు బస్టాండ్ సమీపంలో స్పీడు బ్రేక్ కట్టర్లు ఏర్పాటు చేయాలి

**ఎంపీడీవో కార్యాలయంలో యువకుల వినతి**



**కనగల్లు, అక్టోబర్ 5 (జనంసాక్షి)** నిత్యం ఏదో ఒక సమయంలో ప్రమాదానికి నిలయంగా మారిన పొనుగోడు గ్రామానికి వెళ్లే బస్టాండ్ (కురంపల్లి ఏఎంఆర్పి బ్రిడ్జి సమీపంలో) ఆర్ అండ్ బి రోడ్డు వద్ద స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో పొనుగోడు గ్రామ యువకులు ఎంపీ ఓ పి సతీష్ కుమార్ గౌడ్ కు వినతి పత్రం అందజేశారు. ఆర్ అండ్ బి అధికారులు వెంటనే స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుకు తక్షణ చర్యలు చేపట్టాలని యువకులు కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో కట్ల దిలీప్, పులకరం నాగేష్, పులకరం హరి బాబు, క్రాంతి, బొమ్మరి బోయిన గణేష్, తదితరులున్నారు.

# రైతన్న కడుపు కొట్టిన దుర్మార్గుడు

- అర్ధరాత్రి పూతకొచ్చిన మిర్చి తోట ధ్వంసం
- రూ.లక్షకు పైగా ఆస్తి నష్టం.. లబోదిబోమంటున్న రైతులు
- నిందితుడిపై కేసు నమోదు.. దర్యాప్తు చేస్తున్న తిరుమలాయపాలెం ఎస్సై రాజయ్య



**తిరుమలాయపాలెం, (జనంసాక్షి):** ఆరుగాలం చెమటోడ్చి కంటికి రెప్పలా కాపాడుకుంటున్న పంట చేతికొచ్చే వేళ.. గుర్తుతెలియని దుర్మార్గుడి కన్నుపడింది. నోటికాడి కూడును నేలపాలు చేస్తూ, పచ్చని మిర్చి తోటను అర్ధరాత్రే పీకేసి రైతన్న కడుపు కొట్టిన అమానవీయ ఘటన బచ్చోడు గ్రామంలో వెలుగుచూసింది. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. బచ్చోడు గ్రామానికి చెందిన రైతులు ఎన్నబోయిన ఉప్పయ్య, లింగయ్యలు తమకున్న వ్యవసాయ భూమిలో అప్పులు చేసి మిర్చి పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం తోట ఏపుగా పెరిగి పూత దశకు చేరుకుంది. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి ఎవరూ లేని సమయం చూసి తాటికొండ సనాతన చారి అనే వ్యక్తి కక్షపూరితంగా తోటలోకి చొరబడి మిర్చి మొక్కలను సమూలంగా పీకివేశాడు. తెల్లవారి లేచి తోటకు వెళ్లి చూసిన రైతులకు ధ్వంసమైన మొక్కలు దర్శనమివ్వడంతో గుండెలవిసేలా రోదించారు. సుమారు రూ.లక్షకు పైగా ఆర్థిక నష్టం వాటిల్లిందని, అప్పులపాలై బతికే దారి కనిపించడం లేదని రైతులు కన్నీరుమున్నీరయ్యారు. పంటను ధ్వంసం చేయడమే కాకుండా సదరు వ్యక్తి తమను వివిధ రకాలుగా ప్రాణభయంతో కూడిన బెదిరింపులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. తమకు ప్రాణరక్షణ కల్పించి, న్యాయం చేయాలని బాధిత రైతులు తిరుమలాయపాలెం పోలీసులను ఆశ్రయించారు. రైతుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజయ్య వెల్లడించారు. రైతుల నోటికాడ బువ్వను లాగేసిన దుండగుడిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక రైతాంగం డిమాండ్ చేస్తోంది.

## పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పూనం నర్సయ్య, భూక్య భాస్కర్

**కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్ 5 (జనం సాక్షి):** పీఆర్టీయూ టీఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పూనం నర్సయ్య, భూక్య భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాల్వంచ మండలం జగన్నాధపురంలోని పెద్దమ్మతల్లి ఆలయ ప్రాంగణంలోని అమ్మ ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన జిల్లా జనరల్ బాడీ మీటింగ్, కౌన్సిల్లో ఈ ఎన్నిక జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షంగౌడ్, రాష్ట్ర ఆడిట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో జరిగిన సమావేశంలో జిల్లాలోని 23 మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వారి ఏకగ్రీవ నిర్ణయం మేరకు పూనం నర్సయ్యను జిల్లా అధ్యక్షుడిగా, భూక్య భాస్కర్ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికల అధికారిగా వ్యవహరించిన మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు సతీష్ రెడ్డి నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ జిల్లాలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, వారికి మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు.






## విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ

**ఖమ్మం రూరల్,అక్టోబర్ 5:(జనంసాక్షి)** ప్రియదర్శిని గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో విద్యార్థినుల కోసం 'ఇన్స్పైర్ అండ్ ఇగ్నైట్?ఇన్స్పైరింగ్ మైండ్స్?ఇగ్నైటింగ్ సోల్స్' పేరుతో ఒకరోజు వ్యక్తిత్వ వికాస కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సానుకూల ఆలోచన, లక్ష్య సాధనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ కాటేపల్లి నవీన్బాబు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డా.బి.గోపాల్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో కమ్యూనికేషన్, టీమ్వర్క్, సమయపాలన, సమస్య పరిష్కార నైపుణ్యాలు కీలకమన్నారు. సుధాకర్ దిండి, రంజిత్ దాసరి, శ్రీరామ్ ఉప్పలు, అకడమిక్ డైరెక్టర్ ఏ. వెంకటరమణ విద్యార్థులకు పలు సూచనలు చేశారు.ఈకార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వివిధ వ్యక్తిత్వ వికాస కార్యకలాపాల్లో పాల్గొన్నారు. విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# రిజర్వ్ ఫారెస్టులో వెయ్యికి పైగా సీడ్బాల్స్ చల్లిన ఇంపాక్ట్ రీజన్-3 ఐసీఎఫ్ క్లబ్

- అటవీ విస్తీర్ణం పెంపే లక్ష్యం.. ఖమ్మం రీజన్లో లక్ష సీడ్బాల్స్ తయారీ
- పర్యావరణ పరిరక్షణలో యువత భాగస్వామ్యం.. సహజంగా మొక్కల పెంపునకు వినూత్న కార్యక్రమం

**తిరుమలాయపాలెం, అక్టోబర్ 5 (జనంసాక్షి):** ఇంపాక్ట్ ఇంటర్నేషనల్?రీజన్-3 ఆధ్వర్యంలో ఇండియన్ కామన్ ఫార్మర్ క్లబ్ (ఐసీఎఫ్ క్లబ్) ఖమ్మం అధ్యక్షులు బొమ్మగాని నర్సింహారావు నాయకత్వంలో రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో సీడ్బాల్స్ చల్లే కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటికే తయారు చేసిన సీడ్బాల్స్ను గుండాల మండలం శెట్టిపల్లి, శెంబునిగూడెం రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో వెయ్యికి పైగా చల్లి కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ పిలుపు మేరకు ఖమ్మం రీజన్లో ఒక లక్ష సీడ్బాల్స్ తయారు చేసి, వాటిని రిజర్వ్ ఫారెస్టులు, ఇతర అనువైన అటవీ ప్రాంతాల్లో వెదజల్లాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందులో భాగంగా నిరంతరం సీడ్బాల్స్ తయారు చేస్తూ, అనుకూలమైన అటవీ ప్రాంతాలను గుర్తించి వాటిని చల్లుతున్నారు.పర్యావరణ పరిరక్షణతో పాటు అటవీ విస్తీర్ణాన్ని పెంచడం, సహజంగా మొక్కలు పెరిగేలా చేయడం, క్రమంగా నశిస్తున్న వృక్ష సంపదను పునరుద్ధరించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు



తెలిపారు. సీడ్బాల్స్ ద్వారా వర్షాకాలంలో సహజసిద్ధంగా విత్తనాలు మొలకెత్తి మొక్కలుగా ఎదిగేలా చేయడం ద్వారా పచ్చదనాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఐసీఎఫ్ క్లబ్ అధ్యక్షులు బొమ్మగాని నర్సింహారావు, క్లబ్ సభ్యులు బయ్యా రాజేశ్వర్రావు, శెంబునిగూడెం ప్రాంతానికి చెందిన యువకులు చక్రధర్, నవీన్, శోభన్కుమార్, ఎర్రయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.పర్యావరణ పరిరక్షణలో యువతను భాగస్వామ్యం చేస్తూ చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ రీజన్-3 (ఖమ్మం-మహబూబాబాద్-భద్రాద్రి కొత్తగూడెం) అధ్యక్షులు మహమ్మద్ నవాబ్ పాషా అభినందించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.

జనంసాక్షి



## ఆకాశం తన అందాన్ని అద్దం లాంటి చెరువులో చూస్తున్నట్టు

ప్రకృతి అనేది ఒక అద్భుతమైన దృశ్య కావ్యం...
సాయంత్రం సంధ్య వేళ నిర్మలమైన, ప్రశాంతమైన, తెల్లని మబ్బులతో ఉన్న ఆకాశం పెనుబల్లి రాథోని చెరువులో ప్రతిబింబిస్తుంన్న వేళచిత్రం...

పెనుబల్లి. జనం సాక్షి.

## "జనం సాక్షి" పత్రిక కథనం తో సెంట్రల్ లైటింగ్ కు పూర్వ వైభవం

### హైవె పై నిండుగా వెలుగులు



**పెనుబల్లి, అక్టోబర్ 5(జనంసాక్షి )**
జనం సాక్షి వార్తా పత్రికలో వచ్చిన కథనానికి జాతీయ రహదారి పై సెంట్రల్ లైటింగ్ కు పూర్వవైభవంవచ్చింది. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండల పరిధిలోని జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతినిపోయి వెలుగులు ఆగిపోయాయి. సెంట్రల్ లైటింగ్ పై జనం సాక్షి పత్రికలో కథనం వెలువడింది. ఈ కథనానికి స్పందించిన రహదారి మెయింటినెన్స్ సంస్థ కొద్ది రోజుల్లోనే లైటింగ్ వ్యవస్థను మరామత్తులు చేసి లైట్లు వెలిగే విధంగా చేశారు.

## రాథోని చెరువు సాగు నీటి విడుదల

**పెనుబల్లి ఆగస్టు 5 (జనంసాక్షి)**
పెనుబల్లి మండలం పెనుబల్లి రాథోని చెరువు నుండి సోమవారం సాగునీటిని విడుదల చేశారు. రాతోని ఆయకట్టు పొలాలకు సాగునీటిని విడుదల చేసి పంటను కాపాడాలని ఇరిగేషన్ డి ఈ సిహెచ్ రామారావును ఆయకట్టు రైతులు కోరారు. స్పందించిన డి ఈ నీటిని విడుదల చేసేందుకు అనుమతించారు. చెరువులో ఉన్న ప్రస్తుత నీటిమట్టం పూర్తిగా పడిపోకుండా లిఫ్ట్ ద్వారా చెరువుకి నీళ్లు మళ్లించి సాగునీటిని విడుదల చేసుకోవాలని ఆయకట్టు రైతులకు లిఫ్ట్ కమిటీ సభ్యులకు సూచించారు. అంతేకాకుండా రైతులు చెరువు నీటిని సక్రమంగా సాగునీరు వృధా కాకుండా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొర్రా కోటేశ్వరరావు, లిఫ్ట్ కమిటీ సభ్యులు బొర్రా మల్లయ్య, చిలుకు బత్తుల చెన్నారావు, జిల్లెళ్ల నరసింహస్వామి, అన్నపరెడ్డి లక్ష్మయ్య, పొట్లపల్లి కృష్ణ తదితరులు ఉన్నారు.



## ఘనంగా బ్యాంక్ కాలనీ గణేష్ ఉత్సవ కమిటీ ఆత్మీయ సమ్మేళనం

### అధ్యక్షుడిగా బొబ్బలి అంజిరెడ్డి ఏకగ్రీవ ఎన్నిక



**ఆత్మకూర్ (ఎం) అక్టోబర్ (05) జనంసాక్షి**
మండల కేంద్రంలోని బ్యాంక్ కాలనీలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. సుమారు 70 కుటుంబాల సభ్యులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో సహపంక్తి భోజనం ఏర్పాటు చేయడంతో పాటు గణేష్ ఉత్సవాలకు సహకరించిన పోషకులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా బొబ్బలి అంజిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్, ఎస్సై లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంక్ కాలనీ గణేష్ ఉత్సవ కమిటీ గ్రామంలోనే ఆదర్శవంతంగా నిలుస్తోందని అభినందించారు. ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాల తరహాలో వినాయకుడి లడ్డూను వేలం వేయకుండా భక్తులకు పంచిపెట్టడం అభినందనీయమన్నారు. ప్రతి సంవత్సరం గణేష్ నిమజ్జనం అనంతరం కాలనీవాసులంతా కుటుంబ సమేతంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకోవడం ద్వారా పరస్పర ఆప్యాయతలు, సోదరభావం పెంపొందుతున్నాయని తెలిపారు. సహపంక్తి భోజనంతో పాటు రోజంతా కుటుంబ సభ్యులతో ఉత్సాహంగా గడపడం కాలనీలో ఐక్యతకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో పంజాల రామకృష్ణ గౌడ్, పోతగాని మల్లేశం గౌడ్, భూడిది నాగరాజు గౌడ్, బొబ్బిలి నవీన్, బూడిద శేఖర్ గౌడ్, కొల్లోజు సంతోష్ కుమార్, కరుణాకర్, దశరథ, వెంకన్న, జానయ్య, మల్లయ్య, కిరణ్, మహేష్, లక్ష్మి, శిరీష, సంజన, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## సయ్యద్ బీర్ జాన్ బీ మృతికి కాంగ్రెస్ నేతల సంతాపం

◆కుటుంబ సభ్యులను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

◆ రూ.5 వేల ఆర్థిక సాయం



**ఆత్మకూర్ (ఎం) అక్టోబర్ (05) జనంసాక్షి**
మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందిన సయ్యద్ బీర్ జాన్ బీ ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆమె పార్థివదేహానికి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.
ఈ సందర్భంగా ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఫౌండేషన్ తరఫున మృతురాలి కుటుంబానికి రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వనమాల కృష్ణ, గ్రామ సర్పంచ్ కట్టెకోల సుశీల హనుమంత్ గౌడ్, ఉపసర్పంచ్ మామిడి నర్సిరెడ్డి, ఆత్మకూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కందటి అనంతరెడ్డి, తండా శ్రీశైలం గౌడ్, కందటి దశరథరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీరాముల ఋషి బొడిగె వెంకటయ్య గౌడ్, దేవస్థాన కమిటీ చైర్మన్ మురారిశెట్టి సురేష్ గుప్తా, కట్టెకోల రమేష్ గౌడ్, షేక్ నసీరుద్దీన్, సయ్యద్ జహంగీర్, మామిడి రాజిరెడ్డి, కోల నర్సయ్య గౌడ్, సయ్యద్ గని, కొమురెల్లి నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాధిత గొర్రెల కాపరికి రూ.50 వేల ఆర్థిక సాయం



**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 5 (జనంసాక్షి):**
మండలం లోని జూలూరు గ్రామానికి చెందిన బాలమోని కిష్టయ్య యాదవ్‌కు చెందిన సుమారు 400 గొర్రెలు రైలు పట్టాలపై మృతి చెందిన ఘటనపై బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత స్పందించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో పోచంపల్లి పిఏసిఎస్ చైర్మన్ పాక మల్లేష్ యాదవ్, జిల్లా యాదవ సంఘం నాయకులు గుండెబోయిన అయోధ్య యాదవ్, పాక వెంకటేష్ యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, పాక జంగయ్య యాదవ్, నాయకులు సోము రమేష్ కురుమ, కొత్తపల్లి జంగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీకి సూర్యాపేట జట్టు ఎంపిక 7న కోదాడలో సెలక్షన్స్

**కోదాడ (జనంసాక్షి) :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఈ నెల 10 నుంచి 12 వరకు జరగనున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల కబడ్డీ పోటీలకు సూర్యాపేట జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు అల్లం ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శి నామా నరసింహారావు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా జట్టు ఎంపికలను అక్టోబర్ 7న మధ్యాహ్నం 3 గంటలకు కోదాడ పట్టణంలోని భవానీనగర్ లో ఉన్న ఎస్.వి.కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారిణులు తప్పనిసరిగా ఎస్.ఎస్.సి మెమో,ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు. క్రీడాకారిణులు 20 సంవత్సరాల లోపు వయసు కలిగి, 65 కిలోల లోపు బరువు ఉండాలని పేర్కొన్నారు. జిల్లాలోని అర్హత కలిగిన జూనియర్ బాలికల కబడ్డీ క్రీడాకారిణులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు.

## నాగార్జునసాగర్‌లో జర్నలిస్టులకు ఏఐ, సోషల్ మీడియాపై వర్క్‌షాప్

**నల్లగొండ ప్రతినిధి,అక్టోబర్ 5,(జనం సాక్షి):**
నాగార్జునసాగర్, పరిసర ప్రాంతాల వర్కింగ్ జర్నలిస్టుల కోసం ఈ నెల 12న నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సోషల్ మీడియాపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించ నున్నట్లు రాష్ట్ర మీడియా అకాడమి కార్యదర్శి ఎన్. వెంకటే శ్వరరావు తెలిపారు.వర్క్‌షాప్‌లో ఏఐ, సోషల్ మీడియా రంగాల్లో నిష్ణాతులైన రిసోర్స్ పర్సన్లు జర్నలిస్టులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.వర్క్‌షాప్‌కు హాజం˘య్యేందుకు ఆసక్తి ఉన్న నాగార్జునసాగర్, పరిసర ప్రాంతాల జర్నలిస్టులు ఈ నెల 8లోగా నల్లగొండ కలెక్టరేట్ ఆవరణ లోని జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో సహాయ సంచాలకుల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. గరిష్టంగా 75 మంది జర్నలిస్టులకు శిక్షణ అందించనున్నట్లు, నాగార్జునసాగర్, పరిసర ప్రాంతాల జర్నలిస్టులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని వర్కింగ్ జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలని వెంకటేశ్వరరావు కోరారు.

## గంజాయి అక్రమ రవాణా కేసులో ముగ్గురు నిందితులకు మూడేళ్లు జైలు శిక్ష 10వేలు జరిమానా

**ఖమ్మం టౌన్ అక్టోబర్ (5) జనంసాక్షి ..**
గంజాయి అక్రమ రవాణా కేసులో ముగ్గురు నిందితులకు మూడేళ్లు జైలు శిక్ష 10వేలు జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపుజిల్లా మరియు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డా పుల్లా భట్ల పొగడ కృష్ణార్జును తీర్పువేలువరించార్జు.మధిర టౌన్ పోలీసుస్టేషన్. పరిధిలో 2024ఆగస్టు 2వతేదీన ఒరిస్సా నుండి 2.5ఎిణ ల గంజాయి అక్రమ రవాణా చేస్తూ మధిర లోపట్టుబడిన ముగ్గురు నిందితులపై నమోదైన క్రైమ్ నెంబర్ 133/2024 కేసులో ఎన్ డి పి ఎస్ చట్టం 1985లోని 8(ఇ) రెడ్ విత్ 20(ఎ)(ఎ)(ః) ప్రకారం విచారణ చేపట్టారు ఈ కేసులో మధిర కు చెందిన కళ్యాణపు వంశీ(20)తమ్మిశెట్టి కిరణ్ (19)రెంటపల్లి మహేష్ ఆనంద్ (20)వీరిపై నేరం రుజువు కావడంతో ముగ్గురికి మూడేళ్లు జైలు శిక్ష 10వేలు జరిమానా విధించింది ఈ కేసులో ఒరిస్సా ప్రాంతానికి చెందిన నిందితుడు హాంటాల్ మధు. పరారీలో ఉన్నాడుకేసు. దర్యాప్తు ను ఇన్స్ పెక్టర్ దోమల రమేశ్ ఇన్స్ పెక్టర్ ఆ. మధు నిర్వహించారు.

## పట్టభద్రుల ఓటు నమోదుపై పాలేరునియోజక వర్గ స్థాయి అవగాహన సదస్సు

**పాలేరు అక్టోబర్ (5) జనంసాక్షి**
పట్టభద్రుల ఓటు నమోదుపై పాలేరు నియోజకవర్గ స్థాయి అవగాహన సదస్సు పాలేరు మాజీ ఎం ఎల్ ఏ కందా ల ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సాయి గణేష్ నగర్ క్యాంప్ ఆఫీసులో జరిగింది ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్పు కోరుకునే ఎన్నిక ఇది వరంగల్. ఖమ్మం. నల్గొండ పట్టభద్రుల ఏం ఎల్ సి ఎన్నికల ఓటు నమోదుపై పాలేరు నియోజకవర్గ స్థాయి సమావేశం ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఎం ఎల్ సి తాత మధు పాల్గొన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపేందర్ రెడ్డి. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని పిలుపు ఇచ్చారు గ్రాడ్యుయేట్ ఓటు హక్కు ప్రజాస్వామ్య లో కీలకమని అందరూ. వినియోగించుకోవాలన్నారు నియోజకవర్గంలో అర్హులైన పట్టభద్రుల కు ఓటు నమోదులో నాయకులు కార్యకర్తలు సహాయ సహకారాలు అందించాలన్నారు ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ నాయకులు గ్రాడ్యుయేట్ లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు .

# మర్రిగూడలో గాడి తప్పిన పాలన.. అధికారులదే ఇష్టారాజ్యం!

◆అవినీతిని ప్రశ్నిస్తే వేధింపులా?

◆కిందిస్థాయి ఉద్యోగులే టార్గెట్.. ఎమ్మెల్యేకు అందని క్షేత్రస్థాయి సమాచారం!

◆అధికారుల తీరుతో ప్రజాప్రతినిధులకు తలనొప్పులు




మర్రిగూడ, అక్టోబర్ 5 (జనంసాక్షి) ప్రభుత్వ శాఖల్లో ప్రజాసేవే లక్ష్యంగా పనిచేయాల్సిన అధికారులు వివాదాల్లో చిక్కుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, కార్యాలయాల్లో రాజకీయ జోక్యం, ప్రజాప్రతినిధుల పట్ల నిరాదరణ, కిందిస్థాయి ఉద్యోగులపై ఒత్తిళ్ల ఆరోపణలతో మర్రిగూడ మండలంలో పాలనపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ పథకాల అమలు, గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితులపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దృష్టి సారించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

**ప్రశ్నిస్తే వేధింపులేనా?**

ప్రభుత్వ శాఖల్లో జరుగుతున్న అవకతవకలను ప్రశ్నించే ఉద్యోగులు ఒత్తిళ్లకు గురవుతున్నారనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. విధుల్లోని లోపాలను ఎత్తిచూపే కిందిస్థాయి సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఫిర్యాదులు ఉంటే వాటిపై విచారణ జరగాల్సిన అవసరం ఉంది. ఉద్యోగులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. వేధింపుల కారణంగా ఆత్మహత్యల వంటి తీవ్ర పరిణామాలు చోటుచేసుకున్నాయనే వాదనలుంటే వాటి వెనుక వాస్తవాలను అధికారులు తక్షణమే నిగ్గుతేల్చాలి.

**ఎమ్మెల్యేకు అందని గ్రౌండ్ రిపోర్ట్!**

నియోజకవర్గంలోని ప్రభుత్వ శాఖల పనితీరుపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది. ఏ శాఖలో ఎలాంటి సమస్యలు ఉన్నాయి? ప్రభుత్వ పథకాల అమలులో జాప్యానికి కారణాలేమిటి? ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులేమిటి? అనే అంశాలపై క్షేత్రస్థాయి సమాచారం అందాల్సి ఉంటుంది. అయితే మర్రిగూడ మండలంలో నెలకొన్న సమస్యలపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కు సమగ్ర సమాచారం అందుతోందా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సమస్యలు ముదిరిన తర్వాత ఫిర్యాదులు అందడం కంటే ముందుగానే పరిస్థితులను గుర్తించి పరిష్కరించే వ్యవస్థ అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రజాప్రతినిధులకు మర్యాద కరవు!**

గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులకు మండల కార్యాలయాల్లో తగిన గౌరవం లభించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఆశించిన స్పందన రావడం లేదని పలువురుఅసంతృప్తివ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

**పాలనపై ప్రభావం.. ఎమ్మెల్యేకు తలనొప్పులు!**

మండల స్థాయిలో అధికారుల పనితీరు సరిగా లేకపోతే దాని ప్రభావం ప్రభుత్వ పథకాల అమలుపైనా, గ్రామాల అభివృద్ధిపైనా పడుతుంది. ప్రజల సమస్యలు పరిష్కారం కాకపోవడం, ప్రజాప్రతినిధులు అధికారుల చుట్టూ తిరగాల్సి రావడం పాలనా వ్యవస్థపై అసంతృప్తికి దారితీసే అవకాశం ఉంది. ఇటువంటి పరిస్థితులు కొనసాగితే నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాజకీయ ప్రతిష్ఠపైనా ప్రభావం పడే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**సమీక్షించి చర్యలు తీసుకోవాలి!**

మర్రిగూడ మండలంలోని ప్రభుత్వ శాఖల పనితీరుపై ఎమ్మెల్యే ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. శాఖల వారీగా పెండింగ్ సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు, అధికారుల విధుల నిర్వహణ, ప్రజాప్రతినిధుల ఫిర్యాదులపై నివేదికలు తెప్పించుకోవాలని సూచిస్తున్నారు. అవినీతి, వేధింపులకు సంబంధించిన ఆరోపణలపై నిష్పాక్షిక విచారణ జరిపి, తప్పు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజలకు జవాబుదారీగా పనిచేయాల్సిన ప్రభుత్వ యంత్రాంగం పనితీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి స్పందన కీలకంగా మారింది. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను తెలుసుకుని, అధికారుల పనితీరును సమీక్షించి, పాలనను గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకుంటారా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

## పాము కాటుకు పలువురు రైతులు బలి కావడం బాధాకరం : కాసాల



చండూరు, అక్టోబర్ 5 (జనంసాక్షి) పొలం పనులు చేసుకునేటి రైతులు ఇటీవల పలు ప్రాంతాల్లో వరుసగా పాముకాటుకు బలి అయ్యారని ఇది అత్యంత బాధాకరమని సమాచార హక్కు చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు కాసాల వెంకట్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పాముకాటు ( ఏ ఎస్ వి ) మందు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా పాము కాటుకు గురికాగానే వైద్యుని సందర్శించాలని, మూర్ఖంగా మంత్రం పేరిట సమయం వృధా చేసుకొని ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

## కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా దాసరి లింగయ్య యాదవ్..



రామన్నపేట, అక్టోబర్ 5 (జనంసాక్షి): రామన్నపేట మండలం ఉత్తటూరు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా దాసరి లింగయ్య యాదవ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదేశాల మేరకు నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో సభా అధ్యక్షులుగా గ్రామ సర్పంచ్, సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు కోళ్ల రామకృష్ణ వహించారు.గ్రామ శాఖ అధ్యక్షులుగా దాసరి. లింగయ్య యాదవ్ ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా చెరుకు వసంత ప్రధాన కార్యదర్శి కోళ్ల దణేష్ కోశాధికారి పోగుల గోపాల్ సహాయ కార్యదర్శి గర్వ అశోక్ సహాయ కోశాధికారి ఉప్పునూతల మల్లేష్ సాంస్కృతిక కార్యదర్శి భైరబోయిన రాఘవేంద్ర ఎన్నికయ్యారు. అనంతరం గ్రామ శాఖ అధ్యక్షులుగా ఎన్నికైన దాసరి లింగయ్య యాదవ్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులకు, గ్రామ శాఖ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పున్న జగన్మోహన్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నంద్యాల భిక్షం రెడ్డి సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షులు గుత్తా నర్సిరెడ్డి, మార్కెట్ కమిటీ మెంబర్ కర్నాటి లింగస్వామి, శంబాల వెంకన్న, ఎండి అక్రమ్ మాజీ సర్పంచ్ జెట్టి బాల మల్లయ్య ఉపసర్పంచ్ జెట్టి కృష్ణ యాదవ్ మాజీ ఎంపీటీసీ మేడి చంద్రయ్య మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు జంగిలి. మల్లేష్, పోతుల. మత్స్యగిరి, వార్డ్ మెంబర్స్ మేడి నరసింహ, మల్లె బయిన నరసింహ యాదవ్, సంఘం అధ్యక్షులు జెట్టి సత్యనారాయణ, జంగిలి వెంకటేశం, కోళ్ల కృష్ణయ్య, జెట్టి దేవేందర్, జెట్టి వెంకన్న, జంగిలి నరసింహ, గర్వ సోమయ్య, గొర్ల నరసింహ, గడ్డమీద సత్తయ్య, కుందారపు గణేష్, కోళ్ల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతికతతో సాగుబాట: పెద్దవూర యువకుడికి ‘ఉత్తమ ఐటీ రైతు’ అవార్డు



పెద్దవూర అక్టోబర్ 5 (జనంసాక్షి) సాఫ్ట్‌వేర్ కొలువు చేస్తూనే మట్టి వాసనను మరచిపోకుండా, వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి అద్భుతాలు సృష్టిస్తున్నారు నల్గొండ జిల్లా పెద్దవూర మండలం బట్టుగూడెం గ్రామానికి చెందిన రాహుల్ రెడ్డి. ఐటీ రంగాన్ని, వ్యవసాయాన్ని అనుసంధానిస్తూ వినూత్న పద్ధతుల్లో సాగు చేపడుతున్న ఆయన ప్రతిభకు తగిన గుర్తింపు లభించింది.గాంధీ జయంతి పురస్కరించుకుని హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించిన వేడుకల్లో రాహుల్ రెడ్డికి “ఉత్తమ ఐటీ రైతు అవార్డు?2026” ప్రదానం చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని, ప్రశంసాపత్రాన్ని మరియు జ్ఞాపికను అందుకున్నారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ... సాంప్రదాయ వ్యవసాయానికి సాంకేతికత తోడైతేనే రైతాంగం లాభాల బాట పడుతుందని పేర్కొన్నారు. రాహుల్ రెడ్డి వంటి విద్యాధికులైన యువకులు వ్యవసాయ రంగంలోకి వచ్చి సాంకేతికతను ఉపయోగిస్తూ ఇతరులకు మార్గదర్శకంగా నిలవడం ఎంతో అభినందనీయమని కొనియాడారు.సన్మాన గ్రహీత రాహుల్ రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వం తన కృషిని గుర్తించి అవార్డు ఇవ్వడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఆధునిక పరిజ్ఞానాన్ని మరింతగా ఉపయోగిస్తూ, తోటి రైతులకు కూడా సాంకేతిక సాగుపై అవగాహన కల్పిస్తూ వ్యవసాయ రంగాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. రాహుల్ రెడ్డికి అవార్డు రావడం పట్ల బట్టుగూడెం గ్రామస్థులు, తోటి రైతులు హర్షం వ్యక్తం చేశారు.

## వెంకట్రామయ్య చెరువు అలుగును పునరుద్ధరించాలని ఎంపీడీవో కు వినతి

రామన్నపేట, అక్టోబర్ 5 (జనంసాక్షి): వెంకట్రామయ్య చెరువు అలుగును పునరుద్ధరించాలని సోమవారం ఎంపీడీవో రాములు కు వినతి పత్రం సమర్పించారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే సందర్భంగా వెంకటరామయ్య చెరువు అలుగును పునరుద్ధరించాలని చుట్టుపక్కల రైతులతో కలిసి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ కందుల హనుమంతు మాట్లాడుతూ అలుగు పూర్తిగా ధ్వంసం కావడంతో చెరువులోని నీరు వృధాగా పోవడంతో చెరువు నీటి మట్టం తగ్గుతుందని తద్వారా చెరువు శిఖం అక్రమ కబ్జాలకు గురవుతుందని తక్షణమే అలుగును పునరుద్ధరించి అక్రమ కబ్జాలకు గురికాకుండా కాపాడాలని, చెరువు చుట్టూ హద్దురాలను నాటి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎజాస్ భాయ్, యాటా యిస్తారి, బచ్చా రాములు, కందుల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



## ఉమామహేశ్వర రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



జాజిరెడ్డిగూడెం మండల అక్టోబర్ 5 (జనంసాక్షి): ఉమామహేశ్వర రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం నూతన కమిటీ ఎన్నికను గత అధ్యక్షుడు దాసరి బాబురావు అధ్యక్షతన సోమవారం జాజిరెడ్డిగూడెంలో నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా మాదగాని వెంకన్న, ఉపాధ్యక్షునిగా నర్సింగ పెద్ద లింగయ్య, ప్రధాన కార్యదర్శి దడిగల సమ్మయ్య, కోశాధికారి బోయపల్లి వీరసోములు, కార్యదర్శి రింగు నాగేష్, కార్యవర్గ సభ్యులుగా శిగ పిచ్చయ్య, నోముల నరేష్, భద్ర బోయిన సైదులు, బట్ట మేకల వెంకన్న, బోయపల్లి శేఖర్, బింగి ఉప్పలయ్యలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు మాదగాని వెంకన్న మాట్లాడుతూ సంఘం అభివృద్ధి, రైతుల సంక్షేమం, వారి ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించే దిశగా కృషి చేస్తానని తెలిపారు.

# సూర్యాపేట మీదుగానే బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ ఉండాలి

## మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు



**సూర్యాపేట (జనంసాక్షి):**
శంషాబాద్ నుండి చెన్నై బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్‌ను సూర్యాపేట స్టేషన్ మీదుగానే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బుల్లెట్ ట్రైన్ సాధన సమితి ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు విజయవంతంగా 53వ రోజుకు చేరాయి. అఖిల పక్షం మద్దతుతో జరుగుతున్న ఈ దీక్షల్లో భాగంగా సోమవారం బీజేపీ సూర్యాపేట పట్టణ నాయకులు దీక్షా శిబిరంలో కూర్చున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మొదట ప్రతిపాదించిన రెండు అలైన్‌మెంట్లు సూర్యాపేట స్టేషన్ మీదుగానే ఉన్నాయని, అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను మార్చిందని అన్నారు. సూర్యాపేటకు ఎప్పటి నుంచో రైలు మార్గం లేదనే విషయాన్ని గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఇక్కడి నుండి బుల్లెట్ రైలు మార్గాన్ని ఇవ్వాలని చూస్తే రాష్ట్ర ప్రభుత్వం అడ్డుపడటం సరికాదన్నారు. జిల్లాకు చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులు ఈ తీవ్రమైన విషయంపై వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని కోరారు. సూర్యాపేట ప్రజల ఆకాంక్షను నెరవేర్చడానికి తాము త్వరలోనే కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ని కలిసి ఈ అలైన్‌మెంట్ మార్పుపై ఫిర్యాదు చేయబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ , మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎండి అబిద్ , జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లమల్ల నరసింహ, అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన జిల్లా కన్వీనర్ సలిగంటి వీరేందర్, పట్టణ అధ్యక్షులు బూర మల్సూర్ గౌడ్ , మండల అధ్యక్షులు తాళ్లపల్లి మధు , మాధవరపు అనిల్ , జిల్లా నాయకులు పోలగాని ధనుంజయ్ గౌడ్, అయితగాని జానయ్య గౌడ్, పేర్వాల లక్ష్మణరావు , గట్ల ఉమేష్, గోగుల రమేష్ , ఆకారపు పరిపూర్ణ చారి ,గిలకత్తుల కరుణాకర్ , ఎల్గూరి రామ్మూర్తి, జోగం శ్రీనివాస్, కారింగుల ఉపేందర్, శివరాత్రి రవి, సిరిపంగి ప్రసాద్, బండపల్లి శ్రీనివాస్ , చేన్నబోయిన రాజేష్ , బిట్టు నాగరాజు,అప్పాజీ, ఆరూరి శివ, బొల్లం సాంబశివరావు, వలపట్ల మహేష్, ధరావత్ లక్ష్మణ్,మల్యాల రామారావు,కుంచం సురేష్ , అయితగాని జనార్ధన్, కంచి లింగరాజు, బత్తుల బాబు , షేక్ సలీం పాషా ,రాపోలు ఉపేందర్, శివ, జోగం సాయి, పెంద్ర కృష్ణ , ఏకస్వామి, తండ అంజయ్య , విజయ భాస్కర్,గుండు కల్పన, వీరవెల్లి ఉమా ,శోభ, అఖిలపక్ష నాయకులు, బుల్లెట్ ట్రైన్ సాధన సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివి

### లయన్స్ క్లబ్ నేరేడుచర్ల

నేరేడుచర్ల అక్టోబర్ 05 (జనంసాక్షి):
లయన్స్ క్లబ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ అంకితభావంతో విద్యార్థులకు ఉత్తమ విద్యను అందిస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఓఖఖూ) బేట్టగూడెం ఎస్జీటీ టి.ప్రమీల , జడ్పీహెచ్ఎస్ సోమవారం తెలుగు సహోపాధ్యాయులు ధనావత్ హరీష్ నాయక్ ను శాలువాలతో ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. లయన్స్ క్లబ్ నేరేడుచర్ల అధ్యక్షులు షేక్ యూసుఫ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిస్ట్రిక్ట్ చైర్పర్సన్ బట్టు మధు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని .భావితరాన్ని తీర్చిదిద్దడంలో,దేశ అభివృద్ధికి అవసరమైన ఉత్తమ విద్యార్థులను తయారు చేయడం లో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి సరికొప్పుల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు గుండా సత్యనారాయణ, బాల వెంకటేశ్వర్లు, జీఎంటీ కోఆర్డినేటర్ లాయర్ విశ్వనాథం, అడ్వైజరీ కమిటీ చైర్‌పర్సన్ రాచకొండ విజయలక్ష్మి, అరుణకుమారి, డీపీఓ ప్రణతి,అడ్వైజరీ కమిటీ సభ్యులు కొప్పు లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులను సన్మానించడం ద్వారా వారి సేవలను గుర్తించి గౌరవించడం ఎంతో స్ఫూర్తిదాయకమని లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు.

## సర్ ప్రోగ్రాంను రద్దు చేయాలి



**హుజూర్‌నగర్, అక్టోబర్ 5 (జనంసాక్షి):**
కేంద్ర ఎన్నికల సంఘం తీసుకొచ్చిన సర్ ప్రోగ్రాంను వెంటనే రద్దు చేయాలని, ఓట్ల దొంగ సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్ కుమార్ దేశ్‌ముఖ్, టిపిసిసి మాజీ జాయింట్ సెక్రెటరీ ఎండి. అజీజ్ పాషా లు డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన పత్రికా ప్రకటన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను అడ్డం పెట్టుకొని ఓట్ చోరీకి పాల్పడుతోందని ఆరోపించారు. బీజేపీ అడ్డదారిలో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. సర్ పై సుప్రీంకోర్టు జడ్జి సైతం తప్పుపట్టినా కేంద్రానికి చలనం లేదని, వ్యక్తి చనిపోతే తప్ప ఓటును డిలీట్ చేసే హక్కు ఎవరికీ లేదని, రాజ్యాంగం ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించిందని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసిందని గుర్తు చేశారు. రెండేళ్లుగా రాహుల్ గాంధీ ఓట్ల చోరీపై పోరాటం చేస్తున్నారని, జ్ఞానేష్ కుమార్ అక్రమాలపై ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో సంచలన కథనం వచ్చిందని, అయినా బీజేపీ పెద్దలు ఆయనను తొత్తులా వాడుకుంటున్నారని ఆరోపించారు. తక్షణమే సర్ ను రద్దు చేసి తొలగించిన అర్హుల ఓట్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ఎంఏ అబ్దుల్ మజీద్, కోల మట్టయ్య, ఎస్కే బిక్కన్, పోతబోయిన రామ్మూర్తి, లచ్చిమల్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కక్కిరేణి గ్రామ సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవో కు వినతి

**పలుమార్లు వినతులు, నిరసనలు చేసినా స్పందించకపోవడం శోచనీయం**

**సామాజిక కార్యకర్త వేముల సైదులు**

**రామన్నపేట, అక్టోబర్ 5 (జనంసాక్షి):**
మండలంలోని కక్కిరేణి గ్రామంలో రెండు ప్రధాన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ప్రజావాణి అధికారికి కన్నెబోయిన యాదయ్య, సామాజిక కార్యకర్త వేముల సైదులు వినతిపత్రం సమర్పించారు.

**ప్రధాన సమస్యలు:**
కక్కిరేణి-రంగమ్మగూడెం మధ్య ఈదుల వాగుపై కల్వర్టు: గత 15 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కల్వర్టును వెంటనే నిర్మించి వర్షాకాలంలో ప్రజలు, రైతులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించాలి. విరిగిపోయి ప్రమాదకరంగా మారిన ట్యాంక్ మెట్లను వెంటనే మరమ్మతు చేసి సిబ్బంది భద్రతను కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా వేముల సైదులు మాట్లాడుతూ.. గతంలో అనేకసార్లు అధికారులకు వినతులు సమర్పించినా, నిరసనలు చేసినా సమస్యలు పరిష్కారం కాకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.





## ఉప సర్పంచ్ ల ఫోరం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా వెల్దండ కృష్ణారెడ్డి నియామకం

**వలిగొండ, అక్టోబర్ 5( జనం సాక్షి )**
యాదాద్రి భువనగిరి జిల్లా ఉప సర్పంచ్ ల ఫోరం జిల్లా అధ్యక్షులు డా.సుర్కంటి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిన్నం బాలరాజు భువనగిరి పట్టణంలో జిల్లా కమిటీ సమావేశం జరిగినది. ఈ సమావేశంలో నూతన జిల్లా కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా వెల్దండ కృష్ణారెడ్డి నియామకం చేశారు వెల్దండ కృష్ణారెడ్డి వలిగొండ మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన గ్రామ ఉపసర్పంచ్ పదవి బాధ్యతలు నిర్వహిస్తూ జిల్లా కమిటి వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించిన రాష్ట్ర ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులకు జిల్లా ఉపసర్పంచ్ ఫోరం కమిటీకి ధన్యవాదాలు తెలుపుతూ ఈ నా నియామకానికి సహకరించిన జిల్లాలోని ప్రతి గ్రామ ఉపసర్పంచ్కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నారని ఈ సందర్భంగా ఆయన అన్నారు. జిల్లా ఉప సర్పంచ్ ప్రెసిడెంట్ నియామక పత్రాన్ని జిల్లా అధ్యక్షులు అందజేయడం. ఉప సర్పంచ్ గా జిల్లా కమిటీ సభ్యులుగా ఉపసర్పంచ్ లకు జిల్లాలో ఎక్కడ ఏ సమస్య వచ్చినా నేను అందుబాటులో ఉండి వారి సమస్యలను బాధ్యతయుతంగా నెరవేరుస్తానని ఆయన అన్నారు. ఉపసర్పంచ్ ల హక్కుల కోసం పోరాటం చేసే విధంగా కార్యక్రమంలో నేను వర్కింగ్ ప్రెసిడెంట్ గా నా బాధ్యులను ఇరువర్తిస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

## పార్టీలకు అతీతంగా పట్టణాభివృద్ధే లక్ష్యం

**-మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది**



**సూర్యాపేట (జనంసాక్షి):**
సూర్యాపేట పట్టణాన్ని పార్టీలకు అతీతంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని 43వ వార్డులో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ డ్రైన్, రోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడారు. వార్డుల్లోని ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని,మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. పట్టణ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా పనులు వేగవంతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ షఫీ ఉల్లా, ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్ బత్తుల ఝాన్సీ రమేష్, నాయకులు,మున్సిపల్ అధికారులు డిఈ ప్రణయ్ రెడ్డి, ఏఈ తిరుమలయ్య, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## కుక్కడం మృతదేహం మిస్టరీ ఛేదన

### నల్గొండ వాసిగా గుర్తింపు

**మాడుగులపల్లి సెప్టెంబర్ 5 (జనం సాక్షి):**
మాడుగులపల్లి మండలం కుక్కడం గ్రామ శివారులో లభ్యమైన గుర్తుతెలియని మృతదేహం మిస్టరీని పోలీసులు ఛేదించినట్లు మాడుగులపల్లి ఎస్సై సురేష్ తెలిపారు మృతుడు నల్గొండ పట్టణానికి చెందిన సుబ్బారావు (40)గా గుర్తించినట్లు వెల్లడించారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం కుక్కడం గ్రామ శివారులో ఓ పురుషుని మృతదేహం పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా ఆధారాలు సేకరించగా, ఇతని అదృశ్యంపై ఇప్పటికే నల్గొండ ఎ-టౌన్ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైనట్లు గుర్తించారు ఈ సమాచారాన్ని వెంటనే నల్గొండ ఎ-టౌన్ పోలీసులకు అందించామని ఎస్సై సురేష్ తెలిపారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# కరెంటు కోతలపై రైతన్నలు కన్నెర్ర సబ్‌స్టేషన్ ముట్టడి!

◆12 గంటల నాణ్యమైన కరెంటు ఇవ్వకుంటే ఉద్యమం చేపడతాం

◆ఎక్స్ రోడ్ వద్ద రైతులు, బీఆర్ఎస్ పార్టీ:నేతలు భారీ ధర్నా



**పెన్‌పహాడ్, అక్టోబరు 05 (జనంసాక్షి) :**

వానాకాలం సీజన్‌లో వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన వరి పంటలను కాపాడుకునేందుకు రైతులకు కనీసం 12 గంటల నాణ్యమైన త్రీఫేజ్ విద్యుత్‌ను అందించాలని డిమాండ్ చేస్తూ పెన్‌పహాడ్ ప్రధాన చౌరస్తా (ఎక్స్ రోడ్) వద్ద ఉన్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను రైతులు, బీఆర్ఎస్ పార్టీ నేతలు భారీ ఎత్తున ముట్టడించారు. సబ్‌స్టేషన్ ఎదుట ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి బాసిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. పంటలు చేతికొచ్చే సమయంలో విద్యుత్ కోతలు, నిరంతర అంతరాయాల వల్ల పొలాలకు సాగునీరు అందక వరి పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు హెచ్చుతగ్గుల వల్ల మోటార్లు కాలిపోయి రైతులు మరింత ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. రైతులకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం తక్షణమే స్పష్టత ఇవ్వాలని, వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను పూర్తిస్థాయిలో అందించాలని డిమాండ్ చేశారు.

తక్షణమే పెన్‌పహాడ్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాను మెరుగుపరచాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దొంగలు యుగేందర్, మాజీ ఎంపీపీ నెమ్మద బిక్షం, పిఎసిఎస్ చైర్మన్లు నాతాల జానకి రామ్ రెడ్డి, వెన్న సీతారాంరెడ్డి, మండల నాయకులు తూముల ఇంద్రసేనారావు, మిర్యాల వెంకటేశ్వర్లు, దంతాల వెంకటేశ్వర్లు, పొదిల నాగార్జున, ఊరుకొండ రాధాకృష్ణ, బొలక బొబ్బయ్య, రవీందర్, లక్ష్మణ్, సుధాకర్, గోపి, అంజి నాయక్, రాణపంగ సైదులు, షేక్ షరీఫ్, వినోద్, నాగరాజు, పరంధాములు, సతీష్, నగేష్, శ్రీనివాసరెడ్డి, నర్సింగ్ నాయక్, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ శాఖ అధ్యక్షులు, మహిళా రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## లింగగిరి సీతారామచంద్ర స్వామి ఆలయ నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

**హుజూర్‌నగర్ రూరల్, అక్టోబర్ 5 (జనంసాక్షి):**

మండలంలోని లింగగిరి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార మహోత్సవం సోమవారం ఆలయ ఈవో గుజ్జుల కొండారెడ్డి సమక్షంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ చైర్మన్‌గా నాగమళ్ల రమ్య వీరబాబు ప్రమాణ స్వీకారం చేశారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లమల్ల రాఘవయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర పెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, హుజూర్‌నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అరుణ్ కుమార్ దేశ్‌ముఖ్, మండల అధ్యక్షులు చక్కెర వీరారెడ్డి, మాజీ జెడ్పీటీసీ హఫీజ్ నిజాముద్దీన్, మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, లింగగిరి పిఎసిఎస్ చైర్మన్ కట్టా గోపాలరావు, లింగగిరి ఉప సర్పంచ్, ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షులు చల్లమల్ల సతీష్ నాయకులు, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొని నూతన పాలకమండలికి శుభాకాంక్షలు తెలిపి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

## ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

◆ జిల్లా విద్యా శాఖ అధికారి శ్రీనివాసరావు

◆నూతనంగా నిర్మించిన తరగతి గదులను ప్రారంభిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు



**పెన్‌పహాడ్, అక్టోబర్ 05 (జనంసాక్షి) ;**

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని జిల్లా విద్యాధికారి శ్రీనివాస రావు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని దోసపహాడ్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల లో హైదరాబాద్ హయాత్‌నగర్‌కు చెందిన ప్రముఖ వైద్య సంస్థ 'కృష్ణవేణి హాస్పిటల్' యాజమాన్యం సుమారు 20 లక్షల వ్యయంతో నిర్మించిన రెండు అదనపు తరగతి గదులను ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పాఠశాల నూతన భవన నిర్మాణానికి సొంత నిధులు కేటాయించిన ప్రముఖ దాతలు దొంగరి మురళి – సుగుణ కుమారులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ ప్రమోద్ కుమార్ ల ఉదార స్వభావానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేయడంలో ఉపాధ్యాయులతో పాటు సమాజం కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ జానయ్య, స్థానిక సర్పంచ్ వలపట్ల సైదమ్మ లింగయ్య, మండల విద్యాధికారి నకిరేకంటి రవి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు యర్రంశెట్టి రవీందర్ బాబు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిండిగా నరసయ్య, ఉపాధ్యాయులు మామిడి వెంకన్న , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు దాతలను శాలువాలతో సన్మానించారు..

## అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ ఎన్నిక



**ఆత్మకూర్ (ఎం) జనంసాక్షి :**

మండలంలో ని టి. రేపాక గ్రామ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం రోజున నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షుడి గా ఏనూతుల నవీన్, ఉపాధ్యక్షులుగా ఏనూతుల యాకూబ్, ఏనూతుల రఘు, ప్రధాన కార్యదర్శిగా ఏనూతుల మల్లేష్, కార్యదర్శిగా ఏనూతుల ప్రభాస్, కోశాధికారిగా ఏనూతుల సురేష్ ఎన్నికయ్యారు. సలహాదారులు గా ఏనూతుల బన్ని, ఏనూతుల విష్ణును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాల సాధనకు కృషి చేస్తామని తెలిపారు. గ్రామంలోని యువతను ఐక్యంగా ముందుకు తీసుకెళ్లడంతో పాటు యువత అభ్యున్నతికి, గ్రామ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.

## రెడ్‌క్రాస్‌కు నూతన సారథ్యం

చైర్మన్‌గా సద్ది వెంకట్‌రెడ్డి..

వైస్ చైర్మన్‌గా దిడ్డి బాలాజీ.. కోశాధికారిగా

ఎం.ఎ. రహీం ఏకగ్రీవ ఎన్నిక

**భువనగిరి, అక్టోబర్ 5 (జనం సాక్షి)**

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భువనగిరి శాఖకు నూతన పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అదివారం రాత్రి జరిగిన ఎన్నికల్లో ప్రముఖ వ్యాపారవేత్త, వివేరా హోటల్ యజమాని సద్ది వెంకట్‌రెడ్డి చైర్మన్‌గా, దిడ్డి బాలాజీ వైస్ చైర్మన్‌గా, ఎం.ఎ. రహీం కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.అలాగే స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడితో పాటు పలువురు డైరెక్టర్లను కూడా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గం రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయడంతో పాటు, సంస్థ లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు.ఎన్నిక అనంతరం నూతన పాలకవర్గ సభ్యులు తమ ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ, ఓటర్లకు, రెడ్‌క్రాస్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సంస్థ అభివృద్ధికి సమష్టిగా పనిచేస్తామని వారు తెలిపారు.ప్రజాసేవే లక్ష్యంగా రెడ్‌క్రాస్ చేపడుతున్న కార్యక్రమాలను మరింత బలోపేతం చేసి, అవసరమైన వారికి అండగా నిలిచేలా నూతన కమిటీ కృషి చేయాలని పలువురు సభ్యులు ఆకాంక్షించారు.



## పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి

**చిలుకూరు,అక్టోబర్05(జనంసాక్షి):**

చిలుకూరు మండలంలోని ఆర్లగూడెం గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులు 20 లక్షల రూపాయలతో నిర్మించిన గ్రామపంచాయతీ నూతన భవనాన్ని సర్పంచ్ సమత తో కలిసి ఎమ్మెల్యే భవనాన్ని ప్రారంభించారు. భవనంలోని నిర్మించిన వివిధ గదులను పరిశీలించారు. అలాగే కొండాపురంలో 2.80 కోట్లతో 33/11 కెవి సబ్ స్టేషన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పద్మావతి మాట్లాడుతూ నూతన సబ్ స్టేషన్ అందుబాటులోకి రావడంతో కొండాపురం, మాధవ గూడెం,రామచంద్ర నగర్, ఆర్లగూడెం గ్రామాలలో లోవోల్టేజ్ సమస్యకు పరిష్కారం లభించనుందని తెలిపారు. ఈ సబ్ స్టేషన్ ద్వారా 1,975 గృహ విద్యుత్ వినియోగదారులు 982 వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు కలిపి మొత్తం 2,257 వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. దీనివలన ఆయా గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ఈ సబ్ స్టేషన్ దోహదపడుతుందన్నారు. మండల



కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అగ్రిమార్ట్‌ను ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అగ్రిమార్ట్‌లో రైతులకు అందుబాటులో ఉంచిన వ్యవసాయ సంబంధిత ఉత్పత్తులు, సేవలను ఎమ్మెల్యే పరిశీలించారు. రైతులకు అవసంమైన వ్యవసాయ ఉత్పత్తులు ఒకేచోట సులభంగా అందుబాటులోకి తీసుకురావడం లో అగ్రిమార్ట్ ఉపయోగకరంగా ఉంటుం దని పేర్కొన్నారు. ఎం ఆర్ సిలో 9 లక్షల రూపాయలతో నిర్మించిన భవిత సెంటర్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. భవిత సెంటర్ భవనంలో ఏర్పాటు చేసిన గదుల నిర్మాణాన్ని సౌకర్యాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు అవసరమైన విద్య శిక్షణ సహాయక భవిత సెంటర్లు కీలకంగా మారనున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కీతా వెంకన్న తో పాటు మండల నాయకులు పలు శాఖల జిల్లా,మండల అధికారులు, ఉపాధ్యాయులు, సర్పంచులు, చైర్మన్లు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.